RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 12 జూలై 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:38

# అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందుతాయి.

**మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డి.**
**ఖమ్మం రూరల్, పలు మండలాల్లో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన.**
**4.38 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**







**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై 11 ప్రజాబలం:**గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని, సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి నిరుపేదకూ పారదర్శకంగా అందిస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. సుమారు రూ. 4.38 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు మౌలిక వసతుల పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ సాయాన్ని అందజేశారు.

ఖమ్మం రూరల్ మండలం ఆరేకోడు గ్రామంలో రూ. 2.24 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఆరేకోడు తండా నుంచి కాచిరాజుగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆరేకోడు తండా గ్రామంలో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిధులతో గ్రామీణుల తాగునీటి అవసరాల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఇదే వేదికపై గ్రామానికి చెందిన 20 మంది నిరుపేద నివాస రహితులకు ఇండ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటునందిస్తుందని భరోసా ఇచ్చారు. తిరుమలాయపాలెం మండలం రమణ తండా గ్రామంలో రమణతండా నుంచి ట్యాంక్ బండ్ మీదుగా ములకలపల్లి - తిరుమలాయపాలెం బీటీ రోడ్డు వరకు రూ. 1.94 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న లింక్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల మెరుగుదలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని పేర్కొంటూ, మండల పరిధిలోని 19 మంది లబ్ధిదారులకు సంబంధించిన చెక్కులను అందజేశారు. అదేవిధంగా అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థిక ఇబ్బందులు పడుతున్న 77 మంది లబ్ధిదారులకు రూ. 24.67 లక్షల మొత్తం విలువ కలిగిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఈ సందర్భంగా మంత్రి పంపిణీ చేశారు. కొక్కిరేణి గ్రామంలో రూ. 20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మౌలిక వసతుల కల్పనలో రాజీ పడే ప్రసక్తే లేదని, ప్రతి పనిలోనూ నాణ్యతా ప్రమాణాలు పక్కాగా పాటించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిధుల కొరత లేకుండా చూస్తామని, కాంట్రాక్టర్లు నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# బ్యారేజీ గేట్లు మూస్తే కూలిపోతాయి: రేవంత్ రెడ్డి హెచ్చరిక

**కాళేశ్వరం బ్యారేజీల గేట్లు మూయడం ప్రమాదకరమని ముఖ్యమంత్రి హెచ్చరిక**
**పునరుద్ధరణ పూర్తయ్యే వరకు గేట్లు తెరిచే ఉంచాలని స్పష్టీకరణ**
**జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారమే మరమ్మతులు**
**బీఆర్ఎస్ నేతల కమిటీ సిఫార్సులను పక్కనపెడుతున్నట్లు వెల్లడి**
**గత ప్రభుత్వ అవినీతి వల్లే ప్రాజెక్టుకు ఈ దుస్థితి అని విమర్శలు**

కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల పునరుద్ధరణ పనులు పూర్తికా కుండా గేట్లు మూసివేస్తే, వాటి మనుగడకే పెను ప్రమాదం వాటిల్లుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. బ్యారేజీల భద్రత విషయంలో నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులను తు.చ. తప్ప కుండా పాటించడం అత్యవస రమని ఆయన స్పష్టం చేశారు.



శనివారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి, కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డను వెన్నెముకగా, శ్రీపాద యల్లంపల్లిని గుండెకాయగా అభివర్ణించారు. మేడిగడ్డ నిర్మాణ సమయంలో ఎదురయ్యే సవాళ్లపై గత ప్రభుత్వ హయాంలోనే ఇంజనీర్లు హెచ్చరించినప్పటికీ, కొందరు అధికారులు ఇప్పుడు మాట మారుస్తున్నారని ఆయన ఆరోపించారు. బ్యారేజీల పునరుద్ధరణ కోసం జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కమిటీ చేసిన సూచనలనే తమ ప్రభుత్వం పాటిస్తుందని, బీఆర్ఎస్ నేతలతో కూడిన కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవడం లేదని తేల్చిచెప్పారు."పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకుండా గేట్లు మూసివేస్తే బ్యారేజీలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నిర్మాణాలు స్థిరంగా ఉన్నప్పుడే నీటి నిల్వ, పంపింగ్ సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయడానికి మేడిగడ్డలో కనీసం 5 టీఎంసీల నీటి నిల్వ అవసరమని, అయితే భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా నిపుణుల సలహాల మేరకే తదుపరి చర్యలు చేపడతామని వివరించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, లోపభూయిష్టమైన ప్రణాళికల వల్లే ప్రాజెక్టుకు ఈ దుస్థితి దాపురించిందని ముఖ్యమంత్రి విమర్శించారు. భద్రాచలం వంటి ప్రాంతాలు ముంపునకు గురయ్యేలా నీటిని ఎత్తిపోసే ప్రసక్తే లేదని, ప్రజల భద్రతకు, ప్రభుత్వ వనరులకు నష్టం కలగకుండా ప్రాజెక్టును పునరుద్ధరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.




# మధుర గాయని ఎస్.జానకి గుండెపోటుతో కన్నుమూత

**ప్రముఖ గాయని ఎస్. జానకి (88) మైసూరులో కన్నుమూత**
**ఆరు దశాబ్దాల కెరీర్‌లో 48 వేలకు పైగా పాటలు పాడిన గానకోకిల**
**2013లో ప్రకటించిన పద్మభూషణ్‌ను సున్నితంగా తిరస్కరించిన వైనం**
**కొద్ది నెలల క్రితమే ఏకైక కుమారుడిని కోల్పోయిన జానకి**
**ఆమె మృతితో భారతీయ సంగీతంలో ఒక శకం ముగిసిందన్న**

భారతీయ సినీ సంగీత ప్రపంచంలో తనకంటూ ఒక సువర్ణాధ్యాయాన్ని లిఖించుకున్న ప్రముఖ గాయని, 'దక్షిణ భారత గాన కోకిల'గా ప్రఖ్యాతి గాంచిన ఎస్.జానకి (శిష్టా శ్రీరామమూర్తి జానకి) ఇకలేరు. గత కొంతకాలంగా వయోభారంతో బాధపడుతున్న ఆమె, శనివారం, జూలై 11న కర్ణాటకలోని మైసూరులో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. ఆరు దశాబ్దాల పాటు తన గాన మాధుర్యంతో

మిగతా 2లో

ప్రజాబలం

12 జూలై 2026 ఆదివారం

## తెరపైకి మెన్ కమిషన్

ఇది అత్యంత బాధాకరమైన విషయం.. ఎందుకంటే జరుగుతున్న సంఘటనలు అలా ఉన్నాయి కాబట్టి. గతంలో ఎన్నడూ కూడా ఈ విధంగా లేదు.. ఇలాంటి సంఘటనలు జరగలేదు. కానీ ఇప్పుడు ఒక దాని తర్వాత ఒకటి చోటు చేసుకుంటున్నాయి. ఎలా ఉంటున్నాయి అంటే.. ఒకదాన్ని మించి మరొకటి ఉంటున్నాయి. పైగా భయాన్ని కలగజేస్తున్నాయి. జీవితంలో పెళ్లి అంటేనే వెన్నులో వణుకు పుట్టే విధంగా చేస్తున్నాయి.పూణేలో కేతన్ అగర్వాల్ ను అతనికి కాబోయే భార్య సియా, ఆమె ప్రియుడు చేతన్ చంపేసిన తర్వాత.. ఆ విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత.. ఈ కేసు కు సంబంధించిన అనేక సంచలన నిజాలు ఒకదాని వెంట ఒకటి బయటపడుతున్న తర్వాత.. మనదేశంలో ఒక రకమైన చర్చ నడుస్తోంది. ఆ చర్చ ఏకంగా పార్లమెంట్ దాకా వెళ్ళింది. పైగా పెద్ద పెద్ద రాజకీయ నాయకులు కూడా జరుగుతున్న పరిణామాలను చూసి భయపడుతున్నారు.దేశంలో ఒక వింత, విచిత్రమైన, మునుపెన్నడూ ఊహించని చర్చ మొదలైంది. ఇప్పటివరకు 'మగాడ్రా బుజ్జీ.. నీకేం తక్కువ?' అంటూ మీసాలు తిప్పిన పురుష పుంగవుల కోసం ప్రత్యేకంగా ఒక కమిషన్ కావాలంటూ రాజ్యసభ ఎంపీ అశోక్ కుమార్ మిట్టల్ ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును పార్లమెంట్‌లో పడేశారు. "జాతీయ మహిళా కమిషన్" తరహాలోనే, ఇకపై "జాతీయ పురుషుల కమిషన్" కూడా పెట్టాలని ఆయన డిమాండ్. ఈ బిల్లు బయటకొచ్చిందో లేదో.. పుణెలో జరిగిన కేతన్ అగర్వాల్ హత్య కేసు పుణ్యమా అని సోషల్ మీడియాలో 'మెన్ ఆర్ ఆల్సో హ్యూమన్స్' (మగాళ్లు కూడా మనుషులే) అనే ట్రెండ్ ఊపందుకుంది. కన్నీళ్లు పెడుతున్న 'కండల వీరులు' సమాజంలో మగాడంటే ఎప్పుడూ స్ట్రాంగ్‌గా ఉండాలి, ఏడవకూడదు.. భరించాలి అనే రూల్స్ ఉన్నాయి కదా! కానీ ఈ బిల్లు తెచ్చిన లెక్కలు చూస్తుంటే మగాళ్ల గుండెల్లో దాగున్న బాధలు హిమాలయాలంత ఉన్నట్టు కనిపిస్తోంది. ఇంట్లో భార్య చేతిలో లేదా బెల్లం ముక్క లాంటి అత్తగారి చేతిలో దెబ్బలు తిన్నా బయటకు చెప్పుకోలేక కుమిలిపోయే భర్తలు ఎందరో.. ఎక్స్ లోనో, పోలీస్ స్టేషన్ లోనో ఒక్క తప్పుడు కేసు పడితే.. కెరీర్ గోవిందా! విడాకులయ్యాక పిల్లల్ని చూడనివ్వకుండా కేవలం మెయింటెనెన్స్ డబ్బుల కోసం మాత్రమే వాడుకునే 'ఏటీఎం' మిషన్లుగా మగాళ్లు మారుతున్నారట. ఆఫీసు ఒత్తిళ్లు, సామాజిక అంచనాలు తట్టుకోలేక దేశంలో పురుషుల ఆత్మహత్యల శాతం రాకెట్‌లా దూసుకెళ్తుంటే.. "అయ్యో పాపం" అనే నాథుడే కరువయ్యాడని పురుషుల హక్కుల సంఘాలు గొంతు చించుకుంటున్నాయి. ఒకవేళ దేవుడు కరుణించి అంటే పార్లమెంట్ ఒప్పుకొని ఈ కమిషన్ ఏర్పాటైతే.. మగాళ్లకు ఒక 'సేఫ్ జోన్' దొరుకుతుంది. "మా ఆవిడ నన్ను రోజుకు పదిసార్లు తిడుతోంది సార్" అని ఏడ్చే భర్తలకు ఉచితంగా టిష్యూ పేపర్లు, మానసిక ధైర్యం ఇస్తారు. ఉచిత న్యాయ సహాయం కింద తప్పుడు కేసుల నుంచి ఎలా తప్పించుకోవాలో లాయర్లతో ఫ్రీగా సలహాలు ఇప్పిస్తారు. అలిగిన భర్తలకు, అత్తగారి వేధింపులకు గురయ్యే అల్లుళ్లకు ఇదొక పెద్ద దిక్కు అవుతుంది."మేమేదో మహిళల హక్కులను లాగేసుకుందామని చూడట్లేదు బాబోయ్! వాళ్ల చట్టాలు వాళ్లకుండనివ్వండి.. మాకు కనీసం ఒక చిన్న కంప్లైంట్ బాక్స్ అయినా ఇవ్వండి" అని బిల్లు ప్రతిపాదకులు చేతులు జోడించి మరీ చెప్తున్నారు. చట్టం అవుతుందా.. లేక చాయ్ బిస్కెట్ ముచ్చటవుతుందా? మన దేశ పార్లమెంట్ చరిత్ర చూస్తే 'ప్రైవేట్ మెంబర్ బిల్లులు' చట్టాలుగా మారడం అనేది.. లాటరీలో కోటి రూపాయలు తగలడం కంటే అరుదు. కాబట్టి ఈ బిల్లు రేపో మాపో చట్టం అయిపోయి, మగాళ్లందరికీ రక్షణ వచ్చేస్తుందని పగటి కలలు కనడం కాస్త అత్యాశే అవుతుంది. అయినప్పటికీ "మగాడికి కూడా మనసుంటుంది, వాడికీ కష్టాలొస్తాయి" అనే ఒక టాపిక్ మీద పార్లమెంట్ లో చర్చ జరగడమే ఒక పెద్ద అద్భుతం. మరి ఈ పురుషుల కమిషన్ ముచ్చట ఎంతవరకు వెళ్తుందో అధికార పక్షం దీనిపై ఎలాంటి 'పంచ్‌లు' వేస్తుందో చూడాలి. అంతవరకు.. ఆల్ ది బెస్ట్ మగాళ్లూ! మీ బాధలను వినడానికి కనీసం ఒక బిల్లు అయినా పుట్టుకొచ్చింది, సంతోషించండి.. ఇది పద్ధతి కాదు.. ఇది విధానం కాదు.. దీనికి పాడాలి చరమగీతం అన్నట్టుగా మాట్లాడుతున్నారు.ఇటీవల కాలంలో మగవాళ్ళను ప్రియురాళ్లు, భార్యలు చంపేస్తున్న నేపథ్యంలో.. ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. పెళ్లి చేసుకోవాలంటే మగవాళ్ళు భయపడిపోతున్నారు. అసలు ఇలా కూడా జరుగుతుందా.. ఇలా ప్రాణాలు తీస్తుంటే ఇక పెళ్లిళ్లు ఎందుకు చేసుకోవాలని మగవాళ్ళు ప్రశ్నిస్తున్నారు. ఒంటరి జీవితమే బాగుంటుందని.. ఒంటరిగా మిగిలిపోవడమే గొప్పగా ఉంటుందని భావిస్తున్నారు. మగవాళ్ళ బాధలు చూడలేక కొన్ని సందర్భాలలో రాజకీయ నాయకులూ స్పందిస్తున్నారు. తాజాగా అశోక్ కుమార్ అనే రాజ్యసభ సభ్యుడు పెద్దల సభలో కీలక వ్యాఖ్యలు చేశాడు. మగవాళ్ళ మీద రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని.. మగవాళ్ళను చంపేస్తున్నారని.. మగవాళ్ళ ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయిందని.. చెబుతూ.. మగ వాళ్లకు కూడా కమిషన్ ఏర్పాటు చేయాలని.. ఆడవాళ్ళ నుంచి మగవారిని కాపాడాలని ఆయన సాక్షాత్తు పెద్దల సభలో వ్యాఖ్యానించడం విశేషం. అయితే ఆయన చేసిన వ్యాఖ్యల పట్ల మెజారిటీ ప్రజల నుంచి సానుకూల ప్రకటన రావడం గమనార్హం.

## గవర్నర్‌ను కలిసిన టీజీ-రెరా చైర్మన్



హైదరాబాద్, జూలై 11, 2026:తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ-రెరా) చైర్మన్ శ్రీ కె.ఎస్. శ్రీనివాస రాజు శనివారం లోక్ భవన్‌లో గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా టీజీ-రెరా పనితీరు, చేపడుతున్న కార్యక్రమాలు, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం, వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం అమలు చేస్తున్న చర్యల గురించి గవర్నర్‌కు ఆయన వివరించారు.

అనంతరం బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (బీసీ జేఏసీ) చైర్మన్ శ్రీ జాజుల శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలోని ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసింది.

తదనంతరం బీజేపీ మైనారిటీ మోర్చా తెలంగాణకు చెందిన శ్రీ జగ్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసింది.

## మధుర గాయని ఎస్.జానకి గుండెపోటుతో కన్నుమూత



మొదటి పేజీ తరువాయి

కోట్లాది మంది సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేసిన జానకమ్మ మరణంతో భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసినట్లయింది. ఆమె మనవరాలు అప్సర వైద్యుల ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

జానకికి గుండెపోటు రావడంతో ఈ మధ్యాహ్నం 12.49 గంటలకు అపోలో ఆసుపత్రిలో చేర్చారు. అయితే, చికిత్స పొందుతూ రాత్రి 7.30 గంటలకు తుదిశ్వాస విడిచినట్టు ఆసుపత్రి వర్గాలు ప్రత్యేక బులెటిన్ ద్వారా వెల్లడించాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో 1938 ఏప్రిల్ 23న శిష్టా శ్రీరామమూర్తి, సత్యవతి దంపతులకు జానకి జన్మించారు. ఆమె తండ్రి ఆయుర్వేద వైద్యుడు, ఉపాధ్యాయుడు. బాల్యం ఎక్కువగా సిరిసిల్లలో గడిచింది. తొమ్మిదేళ్ల వయసులోనే తొలిసారి వేదికపై పాడి తనలోని గాన ప్రతిభను చాటుకున్నారు. మేనమామ సలహాతో మద్రాసు చేరిన ఆమె, ఏవీఎం స్టూడియోస్‌లో సంగీత దర్శకుడు ఆర్. సుదర్శనం వద్ద తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1957లో తమిళ చిత్రం 'విధియిన్ విలైయాట్టు'తో నేపథ్య గాయనిగా అరంగేట్రం చేసిన జానకి, అదే ఏడాది తెలుగులో 'ఎమ్మెల్యే' చిత్రంలో పాడారు. తొలి సంవత్సరంలోనే ఏకంగా ఆరు భాషల్లో పాటలు పాడి అబ్బురపరిచారు.

ఆమె ఆరు దశాబ్దాల సుదీర్ఘ సంగీత ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు 20 భారతీయ భాషల్లో, అలాగే ఇంగ్లీష్, జపనీస్, జర్మన్ వంటి విదేశీ భాషల్లోనూ కలిపి 48,000కు పైగా పాటలను రికార్డ్ చేశారు. తన మాతృభాష తెలుగు అయినప్పటికీ, ఆమె అత్యధికంగా కన్నడంలో, ఆ తర్వాత మలయాళంలో పాటలు పాడారు. భావాన్ని బట్టి స్వరాన్ని మార్చడంలో ఆమెకు ఆమే సాటి. అందుకే ఆమెను 'క్వీన్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ అండ్ మాడ్యులేషన్' అని పిలుస్తారు. పీబీ శ్రీనివాస్, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ రాజ్‌కుమార్‌లతో కలిసి ఆమె పాడిన యుగళగీతాలు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఇళయరాజా, ఎం.ఎస్. విశ్వనాథన్, ఏ.ఆర్. రెహమాన్ వంటి దిగ్గజ సంగీత దర్శకులతో ఆమె చేసిన పని అజరామరం.

ఆమె గాత్రానికి 4 జాతీయ పురస్కారాలు, 33 రాష్ట్ర స్థాయి పురస్కారాలు లభించాయి. మైసూరు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. 2013లో కేంద్ర ప్రభుత్వం ఆమెను 'పద్మభూషణ్' పురస్కారానికి ఎంపిక చేయగా, తన సంగీత సేవలకు 'భారతరత్న' రావాలని భావిస్తూ ఆ పురస్కారాన్ని సున్నితంగా తిరస్కరించి తన ఆత్మగౌరవాన్ని చాటుకున్నారు. 2017 అక్టోబర్ 28న మైసూరులో నిర్వహించిన కచేరీతో ఆమె తన గాన ప్రస్థానానికి వీడ్కోలు పలికారు.

1959లో వి. రామ్‌ప్రసాద్‌ను వివాహం చేసుకున్న ఆమెకు ఒక కుమారుడు మురళీ కృష్ణ ఉన్నారు. భర్త రామ్‌ప్రసాద్ 1997లో గుండెపోటుతో మరణించారు. కాగా, ఈ ఏడాది జనవరిలోనే ఆమె ఏకైక కుమారుడు మురళీకృష్ణ అనారోగ్యంతో కన్నుమూయడం ఆమెను తీవ్రంగా కలచివేసింది. కుమారుడిని కోల్పోయిన కొద్ది నెలలకే జానకి కూడా భౌతికంగా దూరమవ్వడంతో సంగీత ప్రపంచం శోకసంద్రంలో మునిగిపోయింది.

## ఫీజుల రియంబర్స్ మెంట్ ఉద్యమాలకు ముఖ్యమంత్రి స్పందించాలి

**అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలి**

**150 బీసీ గురుకుల పాఠశాలలు, 120 బిసి కాలేజీ హాస్టళ్లకు సంఖ్య పెంచాలి.**

**ఆర్. కృష్ణయ్య డిమాండ్**

**ఈ నెల 14 సత్యాగ్రహ దీక్షా - 16న కలెక్టరేట్ల ముట్టడి,నెల 14న ఇందిరా పార్క్ వద్ద సత్యాగ్రహ దీక్షాకు పిలుపు**

హైద్రాబాద్ జులై 11; ఫీజుల రియంబర్స్మెంట్ పై గత నెల రోజులుగా అన్ని విద్యాసంఘాలు ఉద్యమాలు చేస్తున్నాయి. అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలుపుతున్నారు. కానీ ముఖ్యమంత్రి దిగి రాకపోవడం దుర్మార్గమని రాజ్య సభ సభ్యులు

జాతీయ బి.సి సంక్షేమ సంఘంజాతీయ అధ్యక్షులు -ఆర్. కృష్ణయ్య విమర్శించారు. శనివారం బిసి భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ విద్యార్థిలోకం, వారి తల్లిదండ్రులు, సభ్య సమాజం లోకమంతా కూడా కోడై కూస్తున్న ముఖ్యమంత్రి స్పందించకపోవడం సిగ్గుచేటు. బిజెపి బాగా 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని, జీవో నెంబర్ 9ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



బీసీ విద్యార్థులకు డిమాండ్ పెద్ద ఎత్తున్న యున్నందున 150 బిసి గురుకుల పాఠశాలలు, 120 బిసి కాలేజీ హాస్టల్ లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుతం బి.సి గురుకుల పాటశాల అడ్మిషన్లకు లక్షల సంఖ్యలో దరఖాస్తులు రాగా వేల మందికిమాత్రమే సీట్లు ఇచ్చారు. ఇంకా లక్షల సంఖ్యలో విద్యార్థులు సీట్లు లభించక ఇబ్బంది పడుతున్నారు. జిల్లాల నుంచి వచ్చి హైదరాబాద్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. బీసీ గురుకుల పాఠశాల అడ్మిషన్ల గురించి రోజు వందలాది ా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు అడ్మిషన్లు కావాలని తెలుగు సంక్షేమ భవన్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. తమ పిల్లల భవిష్యత్తు బాగుపడాలని ఆవేదన చెందుతున్నారన్నారు.

ప్రస్తుతం అవసరాలకు తగ్గట్లు పెంచాలి. సీట్లు లభించడం లేదు వేలాది మంది విద్యార్థులు సీట్లు దొరకక ఇబ్బందులకు గురవుతున్నారు ప్రైవేట్ హాస్టల్లో ఫీజులు భరించలేక చదువు మానుకుంటున్నారు కావున వెంటనే ప్రభుత్వం స్పందించి ఈ కింది జిల్లాలలో తగురీతిగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం కొనసాగుతుందని

# బెల్లం మాధవి సేవలు అభినందనీయం



హైద్రాబాద్ జులై 11:సామాజు కంగాతెలంగాణా చాంబర్ అఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ చైర్మన్ బెల్లం మాధవి చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.నేడు మంత్రి ఆమె కార్యాలయానికి క్రిస్టియన్ మైనారిటీస్ కార్పొరేషన్ దీపక్ జాన్ తో కలిసి విచ్చేసి మాధవి సేవలను కొనియాడారు.వారిని బెల్లం మాధవి పూల గుచ్చం తో ఆత్మీయంగా ఆహ్వానించారు.అనంతరం బెల్లం మాధవి ఆస్ట్రిలియా లో జరిగే ఓ వేడుకకు సంబందించిన ఇన్విటేషన్ ఆమె వారికి అందజేశారు.

# వియత్నాంలో భారీ విషాదం



న్యూ డిల్లి జులై 11; వియత్నాంలో భారీ విషాదం జరిగింది. భారత టూరిస్టులు ప్రయాణిస్తున్న బోటు ఒకటి నీట మునిగింది. ఈ ప్రమాదంలో పర్యాటకులు గల్లంతయ్యారు. వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఇందులో తెలుగువారు కూడా ఉన్నారు. ఈ మేరకు వియత్నాం హనోయిలోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ప్రమాదం గురించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని ఎక్స్?లో పోస్టు షేర్ చేసింది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 15 మంది చనిపోయినట్లు తెలుస్తోంది.

ప్రమాదంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన టూరిస్టులు!

ఇటీవల ఓ మొబైల్ కంపెనీ 250 మందితో కూడిన ఒక బృందాన్ని భారత్ నుంచి వియత్నాం పర్యటనకు తీసుకెళ్లింది. వీళ్లంతా మొబైల్ కంపెనీకి చెందిన డిస్ట్రిబ్యూటర్లుగా తెలుస్తోంది. అయితే ఇందులో 40 మంది తెలంగాణ, 35 మంది ఆంధ్రప్రదేశ్?కు చెందిన మొబైల్ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారు.

## మీ వ్యాసాన్ని అదే శీర్షికతో సుమారు 250 పదాలకు కుదిస్తూ, ప్రధాన భావాన్ని యథాతథంగా ఉంచాను.

## స్మార్ట్ హైదరాబాద్‌కు స్మార్ట్ ప్రణాళిక తప్పనిసరి

## (సి.హెచ్. ప్రతాప్)

హైదరాబాద్ దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మహానగరాల్లో ఒకటి. సమాచార సాంకేతిక రంగం, ఔషధ పరిశ్రమ, విద్యాసంస్థలు, అంతర్జాతీయ పెట్టుబడులు నగర అభివృద్ధికి బలమైన పునాది వేశాయి. అయితే వేగవంతమైన విస్తరణతో మౌలిక వసతులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రణాళికాబద్ధ పట్టణాభివృద్ధి అత్యవసరం.

ట్రాఫిక్ సమస్య నగరవాసులకు నిత్యసవాలుగా మారింది. వాహనాల సంఖ్య పెరిగినా రహదారుల సామర్థ్యం పెరగలేదు. మెట్రో విస్తరణ, ప్రజా రవాణా బలోపేతం, బస్సుల సమగ్ర అనుసంధానం, పాదచారులు, సైకిల్ మార్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

వర్షాకాలంలో జలమయం కావడం మరో ప్రధాన సమస్య. సహజ నీటి ప్రవాహ మార్గాల ఆక్రమణలు, చెరువుల క్షీణత, బలహీనమైన డ్రైనేజీ వ్యవస్థ దీనికి కారణం. శాశ్వత పారుదల వ్యవస్థతో పాటు చెరువులు, కాలువలు, వాగులను పరిరక్షించాలి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండింటినీ సమతుల్యంగా ముందుకు తీసుకెళ్లాలి.

తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణకు దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. ప్రతి కొత్త నిర్మాణంలో వర్షపు నీటి సంరక్షణ, మురుగునీటి పునర్వినియోగాన్ని తప్పనిసరి చేయాలి. నగరంలో హరిత ప్రాంతాలు, పార్కులు పెంచడం ద్వారా పర్యావరణ సమతుల్యత, గాలి నాణ్యత మెరుగుపడుతుంది.

కృత్రిమ మేధ, భౌగోళిక సమాచార వ్యవస్థలు, స్మార్ట్ ట్రాఫిక్ నిర్వహణ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో నగర పాలనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలి. అదే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, వ్యర్థాల నిర్వహణ, ప్రజా ఆస్తుల సంరక్షణలో పౌరుల భాగస్వామ్యం కూడా కీలకం. దూరదృష్టితో కూడిన ప్రణాళిక, బలమైన మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణ, ప్రజల సహకారంతోనే హైదరాబాద్ నిజమైన ప్రపంచస్థాయి సుస్థిర స్మార్ట్ నగరంగా ఎదుగుతుంది.

# అడవిమల్లెల గురుకుల కళాశాలలో నూతన పేరెంట్స్ కమిటీ ఎన్నిక




సత్తుపల్లి ప్రతినిధి జూలై 11 ప్రజాబలం:పెనుబల్లి మండలం అడవిమల్లెలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఆదేశాల మేరకు నూతన పేరెంట్స్ కమిటీ ఎన్నిక నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి జి. విజయకుమారి ఒక ప్రకటనలో తెలిపారు.

నూతన కమిటీ అధ్యక్షురాలిగా నల్లాంటి సింధూజ, ఉపాధ్యక్షులుగా కె. అరుణ, ఐ. శారద, కె. లక్ష్మీనారాయణ, మాణిక్యాలరావు తదితరులు ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ప్రిన్సిపాల్ జి. విజయకుమారి అభినందించారు. కళాశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం పేరెంట్స్ కమిటీ సహాయ సహకారాలు ఎంతో అవసరమని పేర్కొంటూ, భవిష్యత్తులో కళాశాల పురోగతికి అందరూ సమిష్టిగా సహకరించాలని ఆమె కోరారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

### మంథని మార్కెట్ ఏరియా, ప్రభుత్వ ఆసుపత్రి, సమీకృత కార్యాలయాల సముదాయం, రావులచెరువు అభివృద్ధి పనులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి, జూలై-11, ప్రజాబలం ప్రతినిధి :మంథని పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి నులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మంథని పట్టణంలో నిర్మించనున్న మార్కెట్ ఏరియాను, సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయాన్ని, నూతనంగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని, రావులచెరువు పునరుద్ధరణ పనులను, రావులచెరువు సమీపంలో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లాలోని సుమారు 40 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజు అల్పాహారం, భోజనం అందించేందుకు ఏర్పాటు చేస్తున్న హరే కృష్ణ గోదాముల ఏర్పాటును పరిశీలించి అధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని, ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని అన్ని పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా నిర్ణీత గడువులోపు నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంథనిలో నిర్మిస్తున్న మార్కెట్ ఏరియా, సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, మార్కెట్ ఏరియాలో 100 ఫీట్ల రోడ్డు పనులను పరిశీలించి తరగతి గతిన పూర్తి చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

రావులచెరువు పునరుద్ధరణ పనులను నాణ్యతతో పూర్తి చేసి చెరువును సంరక్షించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో మంథని మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, కౌన్సిలర్ పెంటరాజు, ఆర్డీవో సురేష్, తహసిల్దార్ ఆరిఫుద్దీన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూ రీ-సర్వే లక్ష్యం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




పెద్దపల్లి, జూలై-11, ప్రజాబలం ప్రతినిధి :భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పా భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, విద్యార్థుల యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం ఖమ్మం జిల్లా సమీకృత కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ పాల్గొన్నారు. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.6 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యలను పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందుకోసం శిక్షణ పొందిన 5,700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లకు ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు.

పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, రెవెన్యూ డివిజనల్ అధికారి బి. గంగయ్య, సురేష్, ఏ.డి.సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నమ్మ సంగతి ఏంటీ

రాజమండ్రి, జూలై 11, రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు పురంద్రీశ్వరికి ఈ టర్మ్ లో కీలక పదవి దక్కే అవకాశం లేనట్లే ఉంది. కేంద్ర మంత్రి వర్గ విస్తరణ జరిగినప్పుడల్లా ఆమె పేరు పదే పదే వినిపించడం చివరి నిమిషంలో దక్కకపోవడం జరుగుతుంది. ఈసారి కూడా అదే జరుగుతుందోమేనన్న ఆందోలన చిన్నమ్మ అభిమానుల్లో ఉంది. త్వరలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో పురంద్రీశ్వరికి మళ్లీ పదవి దక్కుతుందని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. కానీ కష్టమేనని చెబుతున్నారు. అందుకు అనేక కారణాలున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా, ఎన్టీఆర్ కుమార్తెగా ఆమె పార్టీ కోసం బాగా పనిచేసినప్పటికీ కొన్ని కారణాలు ఆమె పదవికి అడ్డం పడుతున్నాయన్నది హస్తిన వర్గాల నుంచి అందుతున్న సమాచారం. 2024లో కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో ఆమె కేంద్ర మంత్రి పదవి వస్తుందని అనుకున్నారు. కానీ నర్సాపురం పార్లమెంటు సభ్యుడు శ్రీనివాసవర్మను కేంద్ర మంత్రివర్గంలోకి అనూహ్యంగా తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వంలో టీడీపీకి మాత్రం రెండు పదవులు లభించాయి. తెలంగాణలో ఎనిమిది స్థానాలను గెలవడంతో ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. టీడీపీ నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న గుంటూరు పార్లమెంటుసభ్యులు పెమ్మసాని చంద్రశేఖర్ ప్రధాన కారణం. ఆయనను కేంద్ర మంత్రి వర్గం నుంచి తప్పించే ఛాన్సులు అయితే లేవు. ఎందుకంటే పెమ్మసాని లోకేశ్ కు, చంద్రబాబుకు అత్యంత ఆప్తుడు. పెమ్మసాని కమ్మ సామాజికవర్గం కావడంతో ఇకపురంద్రీశ్వరికి ఆకోటాలో మంత్రివర్గంలో చోటు కల్పించలేని పరిస్థితి నెలకొంది. ఇక జాతీయ అధ్యక్ష పదవి అనికొన్నాళ్లు పురంద్రీశ్వరి పేరు వినిపించింది. కానీ అది సాధ్యం కాలేదు. తర్వాత స్పీకర్ పదవి అన్నారు. ఓంబిర్లాను ఆ పదవి నుంచి తప్పించే అవకాశాలు లేవు. పురంద్రీశ్వరి కి కేంద్రంలో కీలకమైన పదవులు ఈసారి అంటే రానున్న మూడేళ్ల కాలంలో దక్కే అవకాశం లేదన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి, ఇక్కడ పురంద్రీశ్వరి ఎంపీగా మరొకసారి విజయం సాధిస్తే అప్పుడు చూడొచ్చులే అన్న ధోరణిలో కేంద్ర నాయకత్వం ఉందని తెలిసింది.

# ములుగు లో ఘనంగా "స్పోర్ట్స్ ఆన్ వీల్స్" కార్యక్రమం



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జులై 11 ములుగు** టీజీ శాట్, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు "స్పోర్ట్స్ ఆన్ వీల్స్" కార్యక్రమాన్ని ములుగు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ములుగు లో శనివారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని టీజీ శాట్ కోచ్‌లు శ్రీనివాస్, సైదులు, కుమార్ బాబు, ఫిసియోథెరపిస్ట్ రాకేష్ శిఖానా ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు క్రీడల్లో శారీరక దారుఢ్యం, సమన్వయం, చురుకుదనం పెంపొందించే లక్ష్యంతో ప్రత్యేకంగా స్పోర్ట్స్ లాడర్ డ్రిల్స్ ఫిట్‌నెస్ వ్యాయామాలు, అథ్లెటిక్స్‌కు సంబంధించిన ప్రాథమిక శిక్షణ అందించారు. క్రీడల పట్ల ఆసక్తి పెంపొందిస్తూ, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని కోచ్ లు తెలిపారు.

ఈ సందర్భంగా పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి "స్పోర్ట్స్ ఆన్ వీల్స్" వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా జిల్లాలోని అన్ని మండలాల్లో ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాలుగూరి వేణు, జిల్లా పీడీలు మల్లయ్య, మదన్ మోహన్, లవణీక, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట రెడ్డి గారు, ఆదినారాయణ, స్థానిక కోచ్ లు సతీష్, శ్రీరామ్, జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రావులపల్లి సర్పంచ్ మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి కీ జన్మదిన శుభాకాంక్షలు ఘనపూర్ సంతోష్






**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జులై 11 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి మండల ప్రెసిడెంట్ ప్రజాసేవలో నేనున్నానంటూ ముందుకెళ్లి అందరి క్షేమం కోరే రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి అన్నకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఘనపూర్ సంతోష్ రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ప్రజాసేవలో వాడబడాలని ఇంకా ముందు ముందు అనేక పదవులు ఆస్వాదించి ప్రజలకు గొప్ప సేవలు చేసే భాగ్యం దేవుడు దయచేయాలని కోరుతున్నాను అని ఘనపూర్ సంతోష్ తెలిపారు

## రోడ్డు ప్రమాద బాధితుడి నీ ఆసుపత్రికి తరలించిన జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు,కాంగ్రెస్ నాయకులు.

**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 11**ఏటూరునాగారం మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నబోయినపెల్లి చింతలమోరి గ్రామానికి చెందిన ఉంగయ్య కు సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు...



ప్రమాదంలో గాయపడిన బాధితుడిని వెంటనే ఏటూరునాగారం సామాజిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడ వైద్యుల సూచన



మేరకు మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి అంబులెన్స్ ద్వారా తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి చిటమట రఘు సహకరించారు.

# హోం శాఖ సహాయ కేంద్ర మంత్రి బండి సంజయ్ పుట్టినరోజు వేడుకలు



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 11**శనివారం ఏటూరునగరం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు వినుకొల్లు చక్రవర్తి ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ అన్న పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి, టపాసులు టపాకాయలు కాల్చి వైభవంగా నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు వావిలాల జనార్ధన్, మాజీ ఎంపీటీసీ సీనియర్ నాయకులు కేరళ ఎల్లయ్య , మండల ప్రధాన కార్యదర్శులు కర్ణ సంపత్, కందడి ఎలంధర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు యానాల చంద్రారెడ్డి, దుర్గం దుర్గారావు, అటిక నాగేశ్వరరావు మాజీ మండల అధ్యక్షులు గాడి చర్ల రాజశేఖర్ మండల నాయకులు ఎర్ణవడ్ల జగన్, నరాల రవి, బొల్లె శ్రీను, గడ్డం శ్రీధర్, బూత్ అధ్యక్షులు అటిక కృష్ణ మండల యువ నాయకులు దుర్గం శ్రావణ్, కొండ గొర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ పాల్గొనాలి



తేదీ: 11 జూలై, 2026 తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణ అభివృద్ధి శాఖ,మహిళాడశిశు సంక్షేమ శాఖ మరియు గ్రామీణ మంచినీటి సరఫరాల శాఖల మంత్రి శ్రీమతి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశానుసారం,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచన మేరకు,భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సవరణ (సర్) కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ చురుకుగా పాల్గొనాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

మంగపేట మండల పరిధిలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు),బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) సమన్వయంతో పనిచేస్తూ,ప్రతి ఓటరు వివరాలను నమోదు చేయాలని ఆయన సూచించారు.అదేవిధంగా,ప్రతి ఓటరుకు అందుబాటులో ఉంటూ,సర్ కార్యక్రమంలో నమోదైన ఓటర్లందరినీ మ్యాపింగ్ చేయడంలో పార్టీ శ్రేణులు తమ వంతు సహకారం అందించాలని కోరారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని,ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు ఎన్నికల జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు కృషి చేయాలని ఈ సందర్భంగా చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అన్నారు.

# సత్తుపల్లి సింగరేణిలో కల్వకుంట్ల కవిత పర్యటన అడ్డుకున్న పోలీసులు, కార్మికులతో భేటీ




**సత్తుపల్లి ప్రతినిధి జూలై11 ప్రజాబలం:**కార్మికులతో సమావేశానికి వచ్చిన కవితను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం కార్మికులతో సమావేశమైన కవిత కాంగ్రెస్ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీపై తీవ్ర విమర్శలు గుప్పించారు.సత్తుపల్లిలోని జేవీఆర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత కార్మికులతో సమావేశమయ్యారు. సమావేశానికి ముందు పోలీసులు అడ్డుకోవడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్మికుల హక్కుల కోసం మాట్లాడకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని, కాంగ్రెస్ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కలిసి కార్మికులపై మొండిగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని, ప్రభుత్వానికి లొంగిపోయి హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు.

సింగరేణిలో విద్య, వైద్యం, డిపెండెంట్ ఉద్యోగాలు, హెచ్ఆర్ఏ, మెడికల్ బోర్డు, ప్రమోషన్లు, కార్మిక భద్రత వంటి సమస్యలు పరిష్కారం కాకపోయినా గుర్తింపు సంఘాలు స్పందించడం లేదని మండిపడ్డారు.

తమను పోలీసులు అడ్డుకోవడమే అధికార పార్టీ భయానికి నిదర్శనమని పేర్కొన్న కవిత... రానున్న గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో హెచ్ఎంఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అడ్డుకున్న వారిపై చట్టపరంగా పోరాటం చేస్తామని, లేబర్ కోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించిన కవిత... సింగరేణి కార్మికుల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఈనెల 20వ తారీకు లోపు కార్మికుల సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వకపోతే నిర్వాదిక దీక్ష స్వయంగా చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు.పోలీసులను పెట్టి మమ్మల్ని అడ్డుకున్నారంటే మీ గుండెల్లో భయం మొదలైంది.

కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీకి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది.

హెచ్ఎంఎస్ గుర్తింపు సంఘ ఎన్నికల్లో గెలుపు ఢంకా మోగిస్తాం అని తెలిపారు.

## వర్షాకాలంలో డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై11 ప్రజాబలం:**ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు శనివారం ఖమ్మం పట్టణంలోని కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ జనాభా నియంత్రణ, తల్లి-శిశు ఆరోగ్యం, సమతుల్య కుటుంబ వ్యవస్థ, బాలికల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అర్హులైన ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని, దీనివల్ల నులిపురుగుల వల్ల కలిగే రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదలలో ఆటంకాలు వంటి సమస్యలను నివారించవచ్చని వివరించారు.



వర్షాకాలం ప్రారంభమైనందున దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రత్యేక అప్రమత్తత అవసరమని తెలిపారు. ముఖ్యంగా డెంగ్యూ నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీటి నిల్వ పాత్రలను తరచూ శుభ్రపరచాలని, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, కూలర్లలో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే స్వీయ వైద్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

అనంతరం పాఠశాల వంటగదిని పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, వంట పాత్రల శుభ్రత, ఆహార నిల్వ విధానాలను తనిఖీ చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన, పోషకాహారం అందించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా హెచ్‌పీవీ టీకా యొక్క ప్రాముఖ్యతను వివరించిన డాక్టర్ డి. రామారావు, అర్హులైన బాలికలు తప్పనిసరిగా హెచ్‌పీవీ టీకా తీసుకోవాలని, ఈ టీకా భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు ఎటువంటి అపోహలకు లోనుకాకుండా తమ కుమార్తెలకు టీకా వేయించాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, చేతులను సబ్బుతో తరచుగా కడుక్కోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవరుచుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి, పి హెచ్ సి ఎం వి పాలెం నుంచి మరియు హెచ్‌ఈఓ బద్రు ఆశాలు పాల్గొన్నారు.

## పత్తి పంటను నాశనం చేసిన ప్రబుద్ధులు....

## ప్రజాబలం ప్రత్యేక కథనం





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 11(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/**మట్టిని నమ్ముకొని భూతల్లిని కన్నతల్లి కంటే ఎక్కువ చూసుకొని ఆరుగాలం కష్టపడి పంటను పండించి ప్రజల ఆకలి తీర్చే రైతన్నలకు ఏదో ఒక రూపంలో తీరని వేదన మిగులుతుంది. సాధారణంగా పంటలు నాశనం కావడానికి ప్రకృతి వైపరీత్యాలు,అడవి జంతువులు,మరి కొన్నిసార్లు దుండగులు (ప్రబుద్ధులు)కారణమవుతారు అలాంటి ఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆరూర్ గ్రామంలో చోటు చేసుకుంది అదే గ్రామానికి చెందిన రైతు మన్నె విట్టల్ తనకు ఉన్న వ్యవసాయ భూమి సర్వే నంబర్ 137లో 1 ఎకరం 31 గుంటల భూమిలో సాగు చేస్తున్న పత్తి పంటను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే ట్రాక్టర్ రోటవేటర్ తో నాశనం చేశారు,గత రబీ సీజన్లో కూడా ఇలాగే పంటను నాశనం చేశారు,ఈసారి కూడా జులై 7 నాడు అర్ధరాత్రిలో పంటను రొప్పివేయటంతో రైతు మన్నె విట్టల్ పంటను చూసి గుండె బదుకున్నాడు, నా కుటుంబాన్ని పోషించుకోవటానికి నాకు ఈ పంట తప్ప వేరే ఆధారం లేదు అని వాపోయాడు,పంట నాశనం పై స్థానిక సదాశివపేట పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా పోలీసుల స్పందన కూడా కరువైంది అని దయచేసి నా పంటను నాశనం చేసిన దుండగులను గుర్తించి తనకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేశాడు,కన్నతల్లి అప్పుడే పుట్టిన పసిగుడ్డు చనిపోతే ఎంత విలపిస్తుందో అదే మాదిరిగా భూతల్లి నుండి మొలిచిన మొలకలను నాశనం చేసినందుకు భూతల్లి అలాగే విలపించి ఉంటుంది,భూతల్లి శాపం నుండి అనాడు కర్ణుడే తప్పించుకోలేదు ఇప్పుడు ఇలాంటి నీచా మనసు ఉన్నా ప్రబుద్ధులను వదులుతుందా ఒకసారి గుండె మీద చేయి వేసుకుని ఆలోచించండి,ఏది ఏమైనా మనం మనుషులం అనే విషయాన్ని మర్చిపోకండి,

## వైరా రిజర్వేయర్ కు చేరిన గోదావరి జలాలు..

### 100 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు పూర్తి.

### మంత్రి తుమ్మలకు రైతులు కృతజ్ఞతలు.

**ఖమ్మం/తల్లాడ జూలై11 ప్రజాబలం:**జిల్లా రైతాంగ దశాబ్దాల సాగునీటి కల ఎట్టకేలకు సాకారమైంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంకల్పంతో..





సీతారామ ప్రాజెక్ట్ నుంచి రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు వైరా రిజర్వాయర్‌కు చేరుకున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని లక్షలాది ఎకరాలకు అత్యంత నమ్మకమైన రీతిలో సాగునీరు అందించాలనే ఏకైక లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. సుమారు వంద కోట్ల రూపాయల వ్యయంతో ఈ రాజీవ్ లింక్ కెనాల్ నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పూర్తి చేసింది. సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ నుంచి ఈ సరికొత్త లింక్ కెనాల్ ద్వారా గోదావరి నదీ జలాలను విజయవంతంగా మళ్లించారు. దీని ద్వారా, రాష్ట్ర నీటిపారుదల చరిత్రలోనే అత్యంత కీలకమైన కృష్ణా, గోదావరి నదుల అనుసంధాన ప్రక్రియ ఇప్పుడు క్షేత్రస్థాయిలో అద్భుతంగా సాకారమైంది. వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు ప్రవహించడంతో నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలోని చివరి ఎకరానికి సైతం పుష్కలంగా నీరు అందే మార్గం సుగమమైంది. దశాబ్దాలుగా తీవ్రమైన సాగునీటి ఇబ్బందులు, వర్షాభావ పరిస్థితులతో సతమతమవుతున్న స్థానిక రైతులకు ఈ ప్రాజెక్టు ఒక సంజీవనిలా మారబోతోంది. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేయాలంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సుదీర్ఘ కాలంగా కంటున్న సాగునీటి స్వప్నం నేడు ఆచరణలోకి వచ్చింది. దీని వల్ల వ్యవసాయ రంగంలో స్థిరత్వం ఏర్పడటంతో పాటు, స్థానిక రైతాంగ లోకంలో సరికొత్త ఆశలు మరియు హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి..

## ఘాట్ రోడ్డులో ఎలివేటెడ్ కారిడార్

కర్నూలు, జూలై 11, ఏపీలోని పెద్ద దోర్నాల వైపు నుంచి శ్రీశైలం వైపు ఎలివేటెడ్ కారిడార్?పై ఔఉంఎ ఫోకస్ పెట్టింది. శ్రీశైలం ఘాట్‌లో పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు కూడా తీసుకుంటున్నారు. దీని కోసం డబ్ల్యూఐఐతో అధ్యయనం చేయించాలని నిర్ణయించారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ అందుబాటులోకి వస్తే శ్రీశైలం వెళ్లే వాహనాలు రాత్రి సమయంలోనూ ఘాట్‌లో రాకపోకలు కొనసాగించేందుకు అవకాశం వస్తుందని చెబుతున్నారు. శ్రీశైలం మల్లన్న దర్శనానికి ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు వెళుతుంటారు. వాహనాలు నల్లమలలోని ఘాట్ రోడ్డు మీదుగా శ్రీశైలం వెళ్లాలి.. ఈ రూట్‌లో వాహనాల రాకపోకలకు సంబంధించి కొన్ని ఆంక్షలు అమల్లో ఉన్నాయి. ఈ ఘాట్ రోడ్డులో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంట వరకు మాత్రమే వాహనాలను అనుమతిస్తారు. నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు, అడవి జంతువుల కోసం ఘాట్ రోడ్డులో రాత్రివేళల్లో వాహనాలను అనుమతించడం లేదు. ఇటీవల కాలంలో శ్రీశైలం వెళ్లే భక్తుల సంఖ్య పెరుగుతోంది.. రాత్రి సమయంలో ప్రయాణించడానికి అవకాశం లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. శ్రీశైలం వెళ్లే భక్తుల ఇబ్బందుల్ని గమనించి.. నల్లమలలోని అడవి జంతువులకు, భక్తులకు ఇబ్బంది లేకుండా ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల నుంచి శ్రీశైలం వరకు నేషనల్ హైవే 765లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో నల్లమ అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఏపీలోని మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల నుంచి శ్రీశైలం 41.39 కిలోమీటర్ల రోడ్డు ఉంది. తెలంగాణ విషయానికి వస్తే.. బ్రాహ్మణపల్లి నుంచి శ్రీశైలం ప్రాజెక్ట్ వరకు 45.35 కిలోమీటర్ల రోడ్డు ఉంది. మొత్తం కలిపి 86.74 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని ప్లాన్ చేశారు. ఈ ప్రాజెక్టుకు అటవీశాఖ భూమి ఎక్కువగా అవసరం లేదు.. కేవలం పిల్లర్లు నిర్మిస్తే చాలు, దానికి కొంత స్థలం సరిపోతుంది. ఈ ఎలివేటెడ్ కారిడార్ అటవీ ప్రాంతంలో ప్లాన్ చేయడంతో జాతీయ వన్యప్రాణుల బోర్డు) అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుపై అధ్యయనం చేయడానికి డబ్ల్యూఐఐ (వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా) సహకారం కోరారు. పెద్దదోర్నాల మార్గంలో తుమ్మలబైలు, చిన్నారుట్లకు సమీపంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. అందుకే డబ్ల్యూఐఐ టీమ్ అక్కడ వన్యప్రాణుల రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయనుంది. డబ్ల్యూఐఐ ఈ అంశాలపై అధ్యయనం చేసి ఆ నివేదికను జాతీయ వన్యప్రాణుల బోర్డుకు సమర్పిస్తారు. ఆ తర్వాత అనుమతులు వేగంగా వస్తాయని భావిస్తున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ పూర్తి చేస్తే.. వాహనాలు ఏ సమయంలోనైనా శ్రీశైలం వెళ్లే అవకాశం ఉంటుంది.

## త్వరలో బంగ్లాకు వెళ్తా...

న్యూఢిల్లీ, జూలై 11 బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి, అవామీ లీగ్ పార్టీ నాయకురాలు షేక్ హసీనా సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను స్వదేశానికి వెళ్లి న్యాయస్థానం ఎదుట లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. తన ప్రాణాలకు ముప్పు ఉన్నప్పటికీ.. మాతృదేశానికి వెళ్లే ఆలోచనలో ఉన్నానని ఆమె చెప్పారు. రాయిటర్స్ వార్త సంస్థకు ఇచ్చిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో హసీనా ఈ వ్యాఖ్యలు చేశారు. అరెస్టుకు లేదా చావడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని పేర్కొన్నారు. అయితే, ఈ విషయంపై ప్రస్తుత బంగ్లాదేవ్ ప్రభుత్వంతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని ఆమె ఉద్ఘాటించారు. “స్వదేశానికి వెళ్లిన తర్వాత నన్ను వాళ్లు అరెస్టు చేయొచ్చు.. ప్రాణాలు తీసే అవకాశమూ ఉంది.. తీవ్ర అణచివేతకు గురువుతోన్న నా పార్టీ నేతలు, కార్యకర్తల కోసం నేను వెళ్లి తీరాలి.. ఒకవేళ మరణమే తథ్యమైతే నా తల్లిదండ్రులను సమాధి చేసిన చోట, నా సొంత గడ్డపైనే చనిపోవాలని కోరుకుంటున్నా” అని షేక్ హసీనా స్పష్టం చేశారు. ఏదేమైనప్పటికీ వచ్చే డిసెంబరులో తనతో పాటు అవామీ లీగ్ పార్టీ సీనియర్ నేతలు బంగ్లాదేశ్‌కు వెళ్లి కోర్టుల్లో లొంగిపోవాలని నిర్ణయానికి వచ్చామని చెప్పారు. అయితే, తన అప్పగింతపై భారత్‌కు బంగ్లా నుంచి అనేక లేఖలు రాస్తున్నారని.. ఈ నేపథ్యంలోనే వెళ్లాలని నిర్ణయం తీసుకున్నానని ఆమె పేర్కొన్నారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ యువత జులై 2024లో చేపట్టిన ఉద్యమం హింసాత్మకంగా మారి.. చివరకు షేక్ హసీనా పదవికి ఎసరు తెచ్చాయి. అదే ఏడాది ఆగస్టు 5న రాజీనామా చేసిన దేశం విడిచి భారత్‌కు పారిపోయిన వచ్చిన షేక్ హసీనా ఇక్కడే ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. అయితే, యువత నిరసనలను అణచివేయడంలో హసీనా పాత్ర ఉందని ఆరోపిస్తూ అనేక కేసులు నమోదయ్యాయి. అయితే, ఈ ఆరోపణలను హసీనా తోసిపుచ్చారు. కానీ, బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ మాత్రం విచారణ చేపట్టి ఆమెకు గతేడాది మరణశిక్ష విధించింది. ఇటీవల మీడియాతో తాను స్వదేశానికి వెళ్లేందుకు సిద్ధమేనని షేక్ హసీనా చెప్పినప్పటికీ.. ఎప్పుడు వెళ్తారనేది మాత్రం ఇప్పుడే అధికారికంగా స్పష్టత ఇచ్చారు. ఇదిలాఉంటే, మాజీ ప్రధానిని అప్పగించాలని మొహమూద్ యూనస్ నాయకత్వంలోని మధ్యంతర ప్రభుత్వంతో పాటు ఇటీవల ఎన్నికల అనంతరం ఏర్పడిన తారిక్ రెహమాన్ నేతృత్వంలోని బీఎన్పీ సర్కారు భారత్‌ను పలుసార్లు కోరాయి. ఈ అంశంపై న్యాయపరమైన విషయాలను పరిశీలిస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, తనపై పెట్టిన కేసులను రాజకీయ ప్రేరేపితమైనవిగా అభివర్ణించిన షేక్ హసీనా.. న్యాయపరమైన విచారణలో ఇది బయటపడుతుందని నమ్ముతున్నందుకే లొంగిపోవాలని భావిస్తున్నట్లు హసీనా చెప్పారు. “నేను న్యాయాన్ని నమ్ముతాను, విచారణ మొదలయ్యాక కోర్టు ఎంత హాస్యాస్పదంగా ఉందో ప్రజలకు స్పష్టమవుతుందని నేను భావిస్తున్నాను.. దాన్ని నేను నిరూపించాలనుకుంటున్నాను” అని ఆమె అన్నారు. తనపై బనాయించిన కేసులు రాజకీయ ప్రేరేపితమైనవని హసీనా పేర్కొన్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఆమెతో పాటు మరో 112 మందిపై పెట్టిన హత్యాయత్నం కేసును రద్దుచేయాలని బంగ్లాదేశ్ పోలీస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో సిఫార్సు చేసిన నేపథ్యంలో ఈ విషయంలో మరింత స్పష్టమైంది. అరెస్టులు, జైలుకు తాను ఆందోళన చెందడం లేదని ఆమె అన్నారు. తనకు జైలు జీవితం కొత్తకాదని, రాజకీయ జీవితంలో అనేకసార్లు జైలుకు వెళ్లొచ్చానని హసీనా తెలిపారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం నిషేధించిన అవామీ లీగ్‌ను పునర్వ్యవస్థీకరించే ప్రయత్నాలలో భాగంగా బంగ్లాదేశ్‌లోని 300 పార్లమెంటరీ నియోజకవర్గాలలో 125 నియోజకవర్గాలలో తాను ఆన్‌లైన్ సమావేశాలు నిర్వహిస్తున్నానని ఆమె చెప్పారు. అయితే, తన 20 ఏళ్ల పదవీ కాలాన్ని సమీక్షిస్తూ పొరపాట్లు జరిగి ఉండొచ్చని అంగీకరించిన హసీనా.. అంతిమ తీర్పు బంగ్లాదేశ్ ప్రజలదేనని ఆమె నొక్కి చెప్పారు.

# ఈటెల వ్యూహం ఏమిటీ



కరీంనగర్, జూలై 11, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు పార్టీలో చర్చనీయాంశమయ్యాయి. తనకు తెలంగాణ రాష్ట్రం ముఖ్యమని, ఆ తర్వాతే పార్టీ అని, ఆ తర్వాతే వ్యక్తిగతమని ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో లోతైన చర్చకు కారణమయింది. ఈటల రాజేందర్ మావోయిస్టుల నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నుంచి బీఆర్ఎస్ లో పనిచేశారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నప్పటికీ ఆయన తనదైన ముద్రను వేసుకున్నారు. బీసీ నేతగా ఉన్న ఈటల రాజేందర్ తొలి నుంచి వివాదాలకు దూరంగా ఉన్నారు. అయితే బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ తో పొసగకపోవడంతో పాటు ఆయన వైఖరిని వ్యతిరేకించడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.. దీంతో ఈటల రాజేందర్ ఈటల రాజేందర్ బీజేపీ లో చేరారు. హుజూరాబాద్ లో ఓటమి పాలయినా 2024 ఎన్నికల్లో ఈటల రాజేందర్ మల్కాజ్ గిరి నుంచి బీజేపీ తరుపున పోటీ చేసి ఎన్నికయ్యారు. అయితే సామాజికవర్గం కోటాలతోతనకు మంత్రి పదవి లభిస్తుందని ఆశించారు. కానీ రాకపోవడంతో పాటు తాను గతంలో ప్రాతినిధ్యం వహించిన హుజూరాబాద్ కు మాత్రం ఆయనను దూరం చేయడంతో పాటు పార్టీలో సరైన ప్రాతినిధ్యం కల్పించకపోవడంతో కొంత ఈటల రాజేందర్ ఇబ్బందులు పడుతున్నారని గతంలోనూ ప్రచారం జరిగింది. అయితే తిరిగి బీఆర్ఎస్ లో చేరతారన్న ప్రచారాన్ని డు ఈటల రాజేందర్ కొట్టిపారేశారు. కానీ ఇటీవల ఒక వివాహ వేడుకలో మాజీ మంత్రి కేటీఆర్ ను కలవడం, ఆయన కుటుంబ సభ్యులతో కలసి మాట్లాడటంతో మరొకసారి ఈ ప్రచారం ఊపందుకుంది. కానీ ఈటల రాజేందర్ మాత్రం తాను బీజేపీలోనే కొనసాగుతానని చెబుతున్నారు. కానీ ఆయన ఉన్నట్లుండి తనకు తెలంగాణ ముఖ్యమని ఎందుకన్నారు? పార్టీ తర్వాతేనని అన్న మాటకు అర్థం ఏంటన్న దానిపై కూడా బీజేపీ రాష్ట్ర నేతలు ఆరా తీస్తున్నారు. ఈటల బీజేపీలో ఇమడలేకపోతున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. మొదట తనకు మంత్రిగా అవకాశం వస్తుందనుకున్నారు. ఆ తర్వాత బీజేపీ అధ్యక్ష పదవి దక్కుతుందన్న ప్రచారం జరిగినా, ఎప్పటికప్పుడు చెక్ పెడుతూ వచ్చారు తన వైరి వర్గం నేతలు. ఆ తర్వాత కొంత సైలెంట్ గా ఉన్నా, కాళేశ్వరం విషయంలో ఈటల రాజేందర్ దూకుడుగా మాట్లాడుతున్న తీరు ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ వద్ద ఉన్న కన్నేపల్లి పంప్ హౌజ్ నుండి వాటర్ లిఫ్టింగ్ పై కొంతకాలంగా కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. బీజేపీ దాదాపు సైలెంట్ గా ఉన్నా, ఈటల మాత్రం వాయిస్ బీఆర్ఎస్ కు అనుకూలంగా పెంచుతూ వస్తున్నారు. అవినీతి వల్ల మేడిగడ్డ కుంగింది, వాటర్ లిఫ్టింగ్ సాధ్యం కాదని సీఎం రేవంత్, ప్రభుత్వం వాదిస్తుంటే? వాటర్ లిఫ్టింగ్ సాధ్యమేనని బీఆర్ఎస్ వాదిస్తుంది. బీఆర్ఎస్ వాదనను ఎంపీ ఈటల స్ట్రాంగ్ గా సపోర్ట్ చేస్తూ వస్తున్నారు.అవినీతి విషయంలో, అరెస్టుల విషయంలోకి నేను రాను. కానీ కన్నేపల్లి వద్ద ప్రభుత్వం రాజకీయంగా చూస్తూ వాటర్ లిఫ్ట్ చేయటం లేదన్నది ఈటల వాదన. తాను ఎవరో మాట్లాడిస్తే మాట్లాడే వాడిని కాదని, తెలంగాణ మట్టిబిడ్డను, ఉద్యమకారుడిని కాబట్టి అడుగుతున్నా. రైతుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానంటూ ఈటల మరోసారి స్పందించారు.ఇటీవల మాజీ ఎంపీ వినోద్ కొడుకు పెళ్లిలో కేటీఆర్ దంపతులతో ఈటల ఉన్న వీడియోలు వైరల్ కావటం, ఇప్పుడు ఉద్యమకారుడిని అంటూ చెప్తూనే కాళేశ్వరం విషయంలో బీఆర్ఎస్ వాదనతో ఏకీభవించటం, బీజేపీలో ఉన్న గ్రూప్ రాజకీయాలను చూస్తుంటే? ఈటల మనసు మారుతోందా? అన్న అనుమానాలు బలపడుతున్నాయని, రాజకీయాల్లో శాశ్వత శత్రువులు– శాశ్వత మిత్రులు ఉండరన్న విషయం మర్చిపోరాదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.యాధృచ్ఛకంగా అన్న మాటలేనా? లేక ఇందులో ఏదైనా అంతరార్థం ఉందా? అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే ఆయన బీఆర్ఎస్ లో చేరనని చెప్పడంతో బీజేపీలోనే కొనసాగుతూ తన అసంతృప్తిని వెళ్లగక్కే అవకాశముందని కూడా అంటున్నారు. తనను కేవలం ఒక ప్రాంతానికే పరిమితం చేయడంపైన కూడా ఈటల రాజేందర్ గుర్రుగా ఉన్నట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంత వరకైనా పోరాడాతానని ఈటల అనడం పైనా కూడా సోషల్ మీడియాలో వివిధ కామెంట్స్ వినపడుతున్నాయి. ఇప్పటికే బండి సంజయ్, కిషన్ రెడ్డిలతో ఈటల రాజేందర్ కు అంత సంబంధాలు మంచిగా లేవని, ఈటల రాజేందర్ ఎందుకు అన్నారన్నది కాలమే నిర్ణయిస్తుందని అంటున్నారు.

# మూడింటిలో రెండు కార్పొరేషన్లపై గురి

హైదరాబాద్, జూలై 11, తెలంగాణ రాజకీయాల్లో తదుపరి సమరం హైదరాబాద్ మహానగరం వేదికగా ప్రారంభం కానుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ ప్రభుత్వం పాత 1955 నాటి యాక్ట్‌ను రద్దు చేసి పాత గ్రేటర్‌ను మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించి, డివిజన్ల సంఖ్యను 150 నుండి ఏకంగా 300 కి పెంచి ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తోంది. కాంగ్రెస్ వేస్తున్న ఈ త్రిశూల వ్యూహాన్ని తిప్పికొట్టి, హైదరాబాద్‌పై ఎలాగైనా జెండా ఎగరేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ హైకమాండ్ తన వ్యూహాలకు పదును పెట్టింది.ఇందులో భాగంగానే ఇటీవల బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అత్యంత యువ లీడర్ నితిన్ నవీన్ హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా పర్యటించి, రాష్ట్ర కోర్ కమిటీ నేతలకు గట్టి వార్నింగ్ , దిశానిర్దేశం చేసి వెళ్లారు. నితిన్ నవీన్ తన అంతర్గత సమావేశాల్లో రాష్ట్ర నేతలకు అత్యంత స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. పట్టణ ప్రాంతాలు, ముఖ్యంగా హైదరాబాద్ వంటి కాస్మోపాలిటన్ సిటీలు ఎప్పుడూ బీజేపీకి బలమైన కోటలు. లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ చుట్టుపక్కల ఎంపీ స్థానాలు గెలిచినంత మాత్రాన సరిపోదు.. ఈ మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో మన సత్తా చాటకపోతే, తెలంగాణలో అధికారం చేపడతామనే బీజేపీ కల భవిష్యత్తులో కేవలం కలగానే మిగిలిపోతుంది అని ఆయన కుండబద్దలు కొట్టారు. నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పక్కనబెట్టి, కలిసికట్టుగా పోరాడకపోతే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గ్రేటర్‌ను విభజించడం వెనుక కాంగ్రెస్ పొలిటికల్ స్కెచ్ ఉంది. ఓల్డ్ సిటీ పరిధిలోని హైదరాబాద్ , ఐటీ కారిడార్ ఉన్న సైబరాబాద్ , ఉద్యోగులు–మధ్యతరగతి ఎక్కువగా ఉండే మల్కాజ్‌గిరి .. ఈ మూడింటికీ వేర్వేరు వ్యూహాలు కావాలని నితిన్ నవీన్ స్పష్టం చేశారు. రాష్ట్ర బీజేపీ నేతలకు ఇవి కేవలం మున్సిపల్ ఎన్నికలు కావు.. వారి సొంత రాజకీయ భవిష్యత్తును, ఉనికిని చాటుకోవడానికి ఒక అగ్నిపరీక్ష. అందుకే జాతీయ అధ్యక్షుడి పర్యటన ముగిసిన వెంటనే తెలంగాణ బీజేపీ నేతలంతా గ్రేటర్ మున్సిపల్ పరిధిపై అంతర్గత కసరత్తు తీవ్రం చేశారు. గత 2020 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 48 స్థానాలు గెలుచుకుని బీఆర్ఎస్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. ఇప్పుడు బీఆర్ఎస్ బాగా బలహీనపడిన తరుణంలో.. ఆ ఓటు బ్యాంక్ కాంగ్రెస్ వైపు వెళ్లకుండా పూర్తిగా తమ వైపు తిప్పుకోవడమే బీజేపీ ముందున్న అసలైన టాస్క్.కొత్తగా ఏర్పడిన సైబరాబాద్ , మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల పరిధిలో ఐటీ ఉద్యోగులు, వలస ప్రజలు, ఇతర రాష్ట్రాల ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. ఈ సెగ్మెంట్ సాంప్రదాయకంగా ప్రధాని మోదీ నాయకత్వాన్ని ఇష్టపడుతుంది కాబట్టి, ఇక్కడ క్షేత్రస్థాయిలో సరైన అభ్యర్థులను నిలబెడితే మేజర్‌గా లాభపడొచ్చని బీజేపీ భావిస్తోంది. ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాలు, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు బూచీని చూపిస్తూ గ్రేటర్ ఓటర్లను ఆకట్టుకోవాలని చూస్తోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ, మూడు కార్పొరేషన్ల పరిధిలోని 300 డివిజన్లలోనూ బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేసే పనిలో బీజేపీ శ్రేణులు నిమగ్నమయ్యాయి.ఈ త్రిముఖ కార్పొరేషన్ పోరు తెలంగాణ భవిష్యత్తు రాజకీయ గమనాన్ని మార్చనుంది. కాంగ్రెస్ అధికార బలాన్ని, వ్యూహాలను తట్టుకుని నిలబడాలంటే బీజేపీ కేవలం సోషల్ మీడియా పాలిటిక్స్ నమ్ముకుంటే సరిపోదు.. క్షేత్రస్థాయిలో రోడ్ల పైకి వచ్చి పోరాడాల్సి ఉంటుంది. జాతీయ నాయకత్వం పంపిన అల్టిమేటంతో అప్రమత్తమైన తెలంగాణ బీజేపీ లీడర్లు.. ఈ ఎన్నికలను జీవన్మరణ సమస్యగా భావించి సరికొత్త కార్యాచరణతో ముందుకు కదులుతున్నారు. ఒకవేళ ఈ మూడు స్థానాల్లో బీజేపీ మెజారిటీ సాధిస్తే.. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని నిరూపించుకునే గోల్డెన్ ఛాన్స్ దక్కుతుందని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు.

### ఉండవల్లిలో ఉద్రిక్తత.. సీడ్ యాక్సిస్ రోడ్డుకు భూస్వాధీనంపై ఉద్రిక్త పరిస్థితి

గుంటూరు తాడేపల్లి మండలం ఉండవల్లిలో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీడ్ యాక్సిస్ రోడ్డుకు అవసరమైన భూములను సీఆర్డీఏ అధికారులు స్వాధీనం చేసుకునే ప్రక్రియ చేపట్టగా, భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. తమకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా పొలాల్లోని పంటను ధ్వంసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా రైతులను పోలీసులు అక్కడి నుంచి బలవంతంగా తరలించడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది. రైతులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అధికారులు భూస్వాధీన ప్రక్రియ కొనసాగించగా, రైతులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# సిటీలో వాకర్స్ కు కష్టమే...

హైదరాబాద్, జూలై 11, మన దేశంలో చాలా వరకు ఫుట్ పాత్ లు ఆక్రమణకు గురై ఉంటాయి. ఈ నేపథ్యంలోప్రధాన నగరాల్లో పాదచారులకు అనుకూలమైన ఫుట్‌పాత్ లు ఎక్కడెక్కడ ఉన్నాయో 'స్టేట్ ఆఫ్ ఇండియన్ స్ట్రీట్స్ 2026' ఓ నివేదిక ను విడుదల చేసింది. పాదచారులకు సురక్షితంగా, సౌకర్యవంతంగా నడిచే ఫుట్‌పాత్‌లు ఎంత మేర అందుబాటులో ఉన్నాయనే అంశంపై ఈ అధ్యయనం నిర్వహించారు. ఈ అధ్యయనం ప్రకారం దేశంలో అనుకూలమైన ఫుట్‌పాత్ లు ఈ నగరంలో ఉన్నాయో చూద్దాం.. స్టేట్ ఆఫ్ ఇండియన్ స్ట్రీట్స్ ప్రకారం..ఫుట్‌పాత్ ల నిర్వహణ దేశంలోని ఎంపిక చేసిన నగరాల్లో పాదచారులకు అనువైన ఫుట్‌పాత్‌ల శాతంలక్నో 28%, బెంగళూరు 25.9%,హైదరాబాద్ 15.1%, చెన్నై 13.9%, ముంబై, 5.5% గా ఉన్నాయి. ఇతర నగరాలతో పోలిస్తే లక్నోలో పాదచారుల కోసం మెరుగైన మౌలిక సదుపాయాలు ఉండటం వల్ల మొదటి స్థానంలో నిలిచింది. నగర ప్రణాళికలో పాదచారుల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఈ విజయానికి ప్రధాన కారణంగా పేర్కొన్నారు.ఐటీ హబ్‌గా పేరొందిన బెంగళూరు 25.9 శాతం ఫుట్‌పాత్‌లతో రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ 15.1 శాతంతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. నగరంలో కొన్ని ప్రధాన రహదారులపై ఆధునిక ఫుట్‌పాత్‌లు అభివృద్ధి చేసినప్పటికీ, ఇంకా విస్తృత స్థాయిలో మెరుగుదల అవసరమని నివేదిక సూచించింది.చెన్నై 13.9 శాతంతో నాలుగో స్థానంలో ఉండగా, దేశ ఆర్థిక రాజధాని ముంబై కేవలం 5.5 శాతంతో చివరి స్థానానికి పరిమితమైంది. అధిక జనసాంద్రత, రహదారులపై ఆక్రమణలు, పరిమిత స్థలం వంటి కారణాల వల్ల ముంబైలో పాదచారులకు అనువైన ఫుట్‌పాత్‌లు చాలా తక్కువగా ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది.భారత నగరాల్లో ఎక్కువ మంది రోజూ నడిచి ప్రయాణాలు చేస్తున్నప్పటికీ, వారికి తగిన ఫుట్‌పాత్‌లు లేకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆక్రమణలు, పార్కింగ్, నిర్మాణ పనులు, అసమానమైన ఫుట్‌పాత్‌లు పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని నివేదిక వెల్లడించింది.

### నివేదిక సూచించిన మార్గదర్శకాలు

పాదచారులకు అనుకూలమైన నగరాల అభివృద్ధి కోసం అన్ని నగరాల్లో వెడల్పైన, నిరంతరాయంగా కొనసాగే ఫుట్‌పాత్‌లు, దివ్యాంగులకు అనువైన ర్యాంపులు, జీబ్రా క్రాసింగ్‌లు, సురక్షిత రోడ్డు దాటే సౌకర్యాలు, మెరుగైన వీధి లైటింగ్ వంటి మౌలిక సదుపాయాలను పెంచాల్సిన అవసరం ఉందని 'స్టేట్ ఆఫ్ ఇండియన్ స్ట్రీట్స్ 2026' నివేదిక స్పష్టం చేసింది. పాదచారుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే నగరాలు నిజమైన అర్థంలో ప్రజలకు అనుకూలంగా మారతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కేసీఆర్ కు ఏమైంది..

హైదరాబాద్, జూలై 11, తెలంగాణలో కాంగ్రెస్య అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లయింది. తెలంగాణను సాధించి.. రాష్ట్రాన్ని తొమ్మిదిన్నరేళ్లు పాలించిన కేసీఆర్‌ను కొట్టడం ఎవరికీ సాధ్యం కాదనుకున్నారు. కేసీఆర్, కేటీఆర్ కూడా బీజేపీపై ఫోకస్ పెట్టారు. కానీ రేవంత్‌రెడ్డి బాహుబలిలా షాక్ ఇచ్చాడు. బలమైన కేసీఆర్‌ను ఒంటిచేత్తో ఓడించాడు. రెండున్నరేళ్లుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఇలాంటి పరిస్థితిలో కేజీఆర్ రాజకీయ జోష్యాలు చెబుతూ మళ్లీ వచ్చేది బీఆర్ఎస ప్రభుత్వమే.. ముఖ్యమంత్రి అయ్యేది కేసీఆరే అంటూ చెప్పుకుంటున్నారు. ఇవి తెలంగాణ రాజకీయ వాతావరణాన్ని సంక్లిష్టంగా మారుస్తున్నాయి.రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు ఏమీ చేయలేదని, తెలంగాణ ప్రజలు సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ పాలనను పోల్చి చూసుకుంటున్నారని పేర్కొంటున్నారు. మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నారని చెబుతున్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిలో రేవంత్ సగం కూడా చేయలేదని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ వైఫల్యాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయన్న ధీమా కేటీఆర్‌లో కనిపిస్తుంది. కానీ, రెండున్నరేళుల ఫామ్‌హౌస్‌కు పరిమితమైన కేసీఆర్.. రాజకీయాల్లో మళ్లీ యాక్టివ్ అయ్యే పరిస్థితిపై సందిగ్ధం నెలకొంది. కేసీఆర్‌ను ఇక శాశ్వతంగా ఫామ్‌హౌస్‌కే పరిమితం చేస్తామని రేవంత్ అంటున్నారు.ఎన్నికలు కేవలం ప్రత్యర్థి అనుభవ లోపాలపై ఆధారపడి జరుగవు. నాయకత్వం, కమ్యూనికేషన్, స్థానిక శ్రేణులలోని శక్తి సమీకరణం, సందర్భోచిత సంఘటనలు కూడా ఫలితాన్ని నిర్ణయిస్తాయి. కాబట్టి కాంగ్రెస్ విఫలమైందనే కారణంతో బీఆర్ఎస్ నిర్బంధ విజయమనే జోస్యం తాత్కాలికమే. కేసీఆర్ కూతురు పార్టీ నుంచి బయటకు వచ్చి ధైర్యంగా రాజకీయాలు చేస్తున్నారు. కేటీఆర్ మాత్రం ఇప్పటికీ తండ్రి పేరు చెప్పుకుంటున్నారు. కేసీఆరే కాబోయే ముఖ్యమంత్రి అంటున్నారు. తనను తాను సీఎంగా ప్రాజెక్టు చేసుకోలేకపోతున్నారు.బీఆర్ఎస్‌కి పెద్ద పట్టు ఉన్నా, కుటుంబ రాజకీయాలకు సంబంధించిన అనుబంధ, అంతర్గత విభాగాల ఒత్తిళ్లు, కవిత వంటి నాయకత్వ కొత్త అంశాలు పార్టీకి కొత్త సవాళ్లు తీసుకురావచ్చు. ఒక పార్టీకి నిరంతరంగా అధికారంలో ఉండటానికి సమర్థ నాయకత్వానికి తోటి స్థాయి వ్యూహపరమైన నవీనత, యువ శ్రేణుల ఆకర్షణ, పాలనా ప్రదర్శనలో నిరంతర ఉత్తేజం అవసరం. బహుశా ప్రస్తుతం బీఆర్ఎస్ కీలకంగా కనిపించినా, గెలుపు హామీ సులభంగా చెప్పలేం.తెలంగాణలో బీజేపీ ప్రభావం కూడా పెరిగింది. కేంద్ర స్థాయి మద్దతు, వనరుల వినియోగం, స్థానిక మద్దతుదారుల ఆకర్షణ వ్యూహాలు చివరికి స్థానిక బలహీనతలను ఉపయోగించవచ్చు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అంటోంది. బెంగాల్ తర్వాత తెలంణపై ఫోకస్ పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలో బీఆర్ఎస్ కాంగ్రెస్ వైఫల్యాలను నమ్ముకోవడం కుక్క తోక పట్టుకుని గోదావరి ఈదినట్లే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.తెలంగాణ రాజకీయ స్థితి ఒకే పరీక్ష పెడుతున్న సమయం. ఈ సమయంలో పార్టీని, క్యాడర్‌ను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతిపక్ష నాయకులపై ఉంది. మరో ఏడాది గడిస్తే ఎన్నికల మూడ్ వస్తుంది ఆలోగా బలోపేతం కాకుంటే భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుంది.

## ఇంటి సమస్యను అధిగమించేది ఎలా....

## కేటిఆర్, కవితకు సేమ్...సీన్



హైదరాబాద్, జూలై 11, తెలంగాణ రాజకీయాల్లో గులాబీ గూటి పంచాయితీ ఇప్పుడు ఊహించని మలుపు తిరిగింది. నిన్నమొన్నటి వరకు కేవలం అంతర్గత విభేదాలుగా భావించిన వ్యవహారం, ఇప్పుడు ఏకంగా పార్టీ మూలాలనే కదిలించే స్థాయికి చేరింది. సొంతంగా 'తెలంగాణ రక్షణ సేన' పార్టీ పెట్టుకున్న కల్వకుంట్ల కవిత, ఇప్పుడు ఃఖీా అగ్ర నాయకత్వంపై, ముఖ్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లక్ష్యంగా చేస్తున్న ఆరోపణలు రాజకీయ గీతల్ని దాటిపోతున్నాయి. నిన్నటి వరకు రాజకీయ విమర్శలకే పరిమితమైన కవిత.. ఈసారి నేరుగా బీఆర్ఎస్ బ్యాంక్ అకౌంట్లలో ఉన్న పార్టీ ఫండ్, క్విడ్ ప్రో కో వ్యవహారాలను వీధిలోకి లాగడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. బీఆర్ఎస్ ను బద్నాం చేయడంలో ఇప్పుడు ప్రత్యర్థి పార్టీలకంటే కవిత పాత్రే ఎక్కువగా కనిపిస్తుండటం గమనార్హం.బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల అధికార కాలంలో కూడబెట్టిన 1400 కోట్ల నిధులపై కవిత చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. తెలంగాణ ప్రజల సొమ్మును గత ప్రభుత్వ హయాంలో ఆంధ్రా కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని, దానికి ప్రతిఫలంగా ఆ కాంట్రాక్టర్ల నుండి భారీగా కమిషన్లు వసూలు చేసి బీఆర్ఎస్ పార్టీ ఫండ్‌గా మార్చారని ఆమె నేరుగానే ఆరోపిస్తున్నారు. సొంత పార్టీ అధినాయకత్వంపైనే, అది కూడా క్విడ్ ప్రో కో కోణంలో ఇంత పెద్ద ఎత్తున ఆర్థిక మూలాలపై దాడి చేయడం సాధారణ విషయం కాదు. గతంలో కేసీఆర్ అవినీతి రహిత పాలన అందించారని చెప్పుకునే గులాబీ శ్రేణులకు ఇప్పుడు ఈ ఆరోపణలు మింగుడుపడటం లేదు.గతంలో బీఆర్ఎస్ పార్టీ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లేందుకు ఒక సొంత విమానాన్ని కొనుగోలు చేసిందనే ప్రచారం విస్తృతంగా సాగింది. ఆ వివాదం అలా ఉంచితే, తాజాగా జాతీయ ఆంగ్ల దినపత్రిక 'ది పయనీర్' ను కూడా పార్టీ నిధులతోనే కొనుగోలు చేశారంటూ కవిత సరికొత్త బాంబు పేల్చారు. తనను పార్టీ నుంచి వెళ్లిపోయేలా చేసి.. వందల కోట్ల పార్టీ ధనాన్ని వాడుకుంటూ కేటీఆర్ తన సొంత సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటున్నారని, మీడియా సంస్థలను చేతుల్లోకి తీసుకుని బలపడుతున్నారనే ఆవేదన, ఆగ్రహం కవిత మాటల్లో స్పష్టంగా కనిపిస్తోంది.పార్టీలో తనకు ప్రాధాన్యత లేకపోవడంతో కవిత 'తెలంగాణ రక్షణ సేన' అని పేరుతో పార్టీ పెట్టుకున్నారు. కానీ కేటీఆర్ ఆ పేరు రాకుండా పెద్ద ఎత్తున లాబీయింగ్ చేశారని కవిత నమ్ముతున్నారు. తెలంగాణ సెంటిమెంట్ బలాన్ని తాను పొందేందుకు, గ్రౌండ్ లెవెల్‌లో క్యాడర్‌ను సమీకరించుకునేందుకు తాను కొత్తగా టీఆర్ఎస్ పేరుతో పొలిటికల్ ప్లాట్‌ఫారమ్‌ను పునరుద్ధరించాలని చేస్తున్న ప్రయత్నాలను కేటీఆర్ తీవ్రంగా అడ్డుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ పేరును తానే రిజిస్టర్ చేయించుకుని కవితకు చెక్ పెట్టాలని కేటీఆర్ చూడటంతో ఆమెలో అసహనం కట్టలు తెంచుకుంది. అటు సెంటిమెంట్ పేరు దక్కకపోవడంతో.. నైతికంగా దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తున్నారు.రాజకీయాల్లో ప్రత్యర్థులు చేసే ఆరోపణలకు, సొంత కుటుంబ సభ్యులు.. అదీ మాజీ ముఖ్యమంత్రి కూతురు చేసే ఆరోపణలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. ప్రతిపక్షాలు ఎంత మొత్తుకున్నా రాని మైలేజ్, ఇప్పుడు కవిత చేసిన వ్యాఖ్యల ద్వారా బీఆర్ఎస్ వ్యతిరేక పార్టీలకు సులువుగా దొరికింది. బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేయడానికి ఇంతకంటే బలమైన అస్త్రం ప్రత్యర్థులకు దొరకదు. కవిత చేసిన ఈ క్విడ్ ప్రో కో, 1400 కోట్ల కమిషన్ల ఆరోపణలు బీఆర్ఎస్ పార్టీని నైతికంగా కోలుకోలేని దెబ్బతీసే అవకాశం ఉంది.

# స్ట్రాటజీ సర్వే వర్కౌట్ అవుతుందా...

హైదరాబాద్, జూలై 11, తెలంగాణ రాజకీయాలు వ్యూహ ప్రతివ్యూహాలతో రసవత్తరంగా సాగుతున్నాయి. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికొత్త దుమారాన్ని లేపాయి. తెలంగాణలో అధికార కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఏకంగా 78 సీట్లు గెలుచుకుని మళ్లీ అధికారంలోకి వస్తుందంటూ ఆయన చేసిన కామెంట్స్ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చేయించుకున్న అంతర్గత సర్వేల్లోనే కాంగ్రెస్ ఓడిపోతుందని తేలిందని కేటీఆర్ బాంబు పేల్చారు. కేవలం పార్టీ సర్వేలే కాకుండా, రెండు ప్రముఖ మీడియా సంస్థల సర్వేలు, అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాల ఇంటెలిజెన్స్ వర్గాలు సేకరించిన నివేదికల్లోనూ బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ వస్తుందని తేలిందని ఆయన నొక్కి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కాస్త డీలా పడ్డ గులాబీ శ్రేణుల్లో కేటీఆర్ ప్రకటన సరికొత్త జోష్ నింపిందనే చెప్పాలి.కేటీఆర్ సర్వేల రాజకీయంపై కాంగ్రెస్ శ్రేణులు అంతే తీవ్రంగా స్పందించాయి. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలకు ఇలాంటి సొల్లు కబుర్లు చెప్పడం, పగటి కలలు కనడం అలవాటేనంటూ కాంగ్రెస్ నాయకులు ఎద్దేవా చేస్తున్నారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ప్రతి మూడు నెలలకోసారి సర్వేలు చేయించుకుని, 'మళ్లీ మనదే అధికారం, మనకు తిరుగులేదు' అంటూ చంకలు గుద్దుకునేవారని, ఇప్పుడు కొడుకు కేటీఆర్ కూడా అదే అలవాటును కొనసాగిస్తున్నారని విమర్శిస్తున్నారు.తాము బీఆర్ఎస్ నాయకుల్లాగా కేవలం కాగితాలపై ఉండే సర్వేలను నమ్ముకుని రాజకీయం చేయమని, క్షేత్రస్థాయిలో ప్రజల కోసం పనిచేస్తామని కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుండి అమలు చేస్తున్న ప్రజా రంజక పాలన, ఆరు గ్యారెంటీలపైనే తమకు నమ్మకం ఉందని, ఇలాంటి మైండ్ గేమ్స్‌కు భయపడే ప్రసక్తే లేదని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణలో సర్వేల రాజకీయం కొత్తేమీ కాదు. అయితే, కేవలం సర్వేలను నమ్ముకుని సంబరపడితే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. గతంలో దేశవ్యాప్తంగా, అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ పలు రాజకీయ పార్టీలు అంతర్గత, ఐవీఆర్ఎస్, మీడియా సర్వేలను నమ్మి, క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించి బొక్కబోర్లా పడ్డ ఉదాహరణలు అనేకం ఉన్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా బీఆర్ఎస్ అనుకూలంగా అనేక సర్వేలు వచ్చాయని, కానీ క్షేత్రస్థాయిలో ప్రజల మూడ్ వేరేలా ఉందనే విషయాన్ని గ్రహించకపోవడం వల్లే ఆ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.సర్వేలు అనేవి ఒక నిర్దిష్ట సమయంలో ప్రజల మానసిక స్థితిని అంచనా వేయడానికి మాత్రమే పనికొస్తాయి. కానీ అవి శాశ్వత విజయానికి గ్యారెంటీ ఇవ్వలేవు. నిజమైన ప్రజాభిమానం క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడు, వారి నమ్మకాన్ని గెలుచుకున్నప్పుడు మాత్రమే లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# అల్లు అర్జున్ పొలిటికల్ పార్టీ ప్రచారం...

హైదరాబాద్, జూలై 11, సోషల్ మీడియా సమాజానికి ఎంత ఉపయోగపడుతోందో, అంతకంటే వేగంగా పనిలేని వారి ఊహా ప్రపంచం గా మారిపోతోంది. ముఖ్యంగా గత రెండు, మూడు రోజులుగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను టార్గెట్ చేస్తూ సాగుతున్న రాజకీయ ప్రచారం చూస్తుంటే.. అసలు తాను కొత్త పార్టీ పెడుతున్నానన్న విషయమో, లేదా ఒకరి ప్లాన్ ప్రకారం అడుగులు వేస్తున్నానన్న విషయమో కనీసం అల్లు అర్జున్‌కైనా తెలుసా? అనే అనుమానం రాక మానదు. రాజకీయాల్లో ఉన్న స్నేహితులతో లేదా బంధువులతో ఉండే వ్యక్తిగత అనుబంధాలతో ఒకరిద్దరితో దిగిన ఫోటోలనో, పర్యటనలనో బేస్ చేసుకుని కథలు అల్లేయడం డిజిటల్ మీడియాలో ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. తన దృష్టిని పూర్తిగా పాన్-ఇండియా కెరీర్ మీదే కేంద్రీకరించిన ఒక టాప్ హీరోను బలవంతంగా రాజకీయాల్లోకి లాగడం వెనుక సోషల్ మీడియా అల్గారిథమ్స్, వ్యూస్ వేట తప్ప మరోటి కనిపించడం లేదు.ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా నడుస్తున్న ప్రచారాల్లో ప్రధానంగా మూడు సిల్లీ థియరీలు వినిపిస్తున్నాయి. మొదటిది.. అల్లు అర్జున్ ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో రహస్య చర్చలు జరిపారని, ఒక పక్కా పొలిటికల్ స్కెచ్ సిద్ధం చేసుకుంటున్నారని కొందరు రాసుకొస్తున్నారు. మరికొందరైతే ఒక అడుగు ముందుకు వేసి.. తమిళనాడులో దళపతి విజయ్ తరహాలోనే, బన్నీ కూడా తన మామ చంద్రశేఖర్ రెడ్డి వ్యూహాలతో, పుష్ప సినిమాలలో అరెస్టుతో అవమానించిన రేవంత్ రెడ్డిని కాదని లంగాణలో కొత్త పార్టీ పెట్టి సీఎం అయిపోతారని గాల్లో మేడలు కడుతున్నారు.

ఇంకొక వర్గం.. ఏపీలో జగన్ రెడ్డి ప్లాన్ ప్రకారమే అల్లు అర్జున్ అడుగులు పడుతున్నాయని, భవిష్యత్తులో అక్కడ చక్రం తిప్పుతారని సరికొత్త స్క్రిప్ట్ వండి వారుస్తున్నారు.దక్షిణాదిలో సినిమాలకు, రాజకీయాలకు విడదీయరాని బంధం ఉందనేది నిజమే. ఎన్టీఆర్, ఎంజీఆర్ లీగసీ నుంచి నిన్నటి పవన్ కల్యాణ్, నేటి విజయ్ వరకు వెండితెర ఇమేజ్‌తో రాజకీయాల్లో సక్సెస్ అయిన వారు ఉన్నారు. అయితే, ఒక నటుడు రాజకీయాల్లోకి రావాలా వద్దా అనేది అతని వ్యక్తిగత, సిద్ధాంతపరమైన నిర్ణయం. అల్లు అర్జున్ గతంలోనే తాను రాజకీయాలకు న్యూట్రల్ అని, తనకు అన్ని పార్టీల్లోనూ స్నేహితులు ఉన్నారని స్పష్టం చేశారు. కేవలం గతంలో నంద్యాల పర్యటన లేదా హైదరాబాద్ సంధ్య థియేటర్ ఘటనల తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలను బూతద్దంలో చూపిస్తూ.. ఆయనపై రాజకీయ ముద్ర వేయాలని చూడటం సరికాదు. పుష్ప-2 రికార్డుల ప్రభంజనం తర్వాత బాలీవుడ్, టాలీవుడ్‌లలో అత్యంత క్రేజ్ ఉన్న హీరోగా, వందల కోట్ల మార్కెట్ ఉన్న గ్లోబల్ స్టార్‌గా కెరీర్ పీక్స్‌లో ఉన్న బన్నీ.. ఇప్పుడప్పుడే సినిమాలు వదిలేసి పూర్తిస్థాయి రాజకీయాల్లోకి వస్తారని ఎవరూ అనుకోరు.ప్రజాస్వామ్యంలో ఎవరికైనా పార్టీ పెట్టే హక్కు, రాజకీయాల్లోకి వచ్చే అర్హత ఉన్నాయి. ఒకవేళ అల్లు అర్జున్ భవిష్యత్తులో నిజంగానే ప్రజాసేవ వైపు రావాలనుకుంటే.. ఆ విషయాన్ని ఆయనే స్వయంగా, ధైర్యంగా లౌడ్‌గా అనౌన్స్ చేస్తారు. అంతేకాని, యూట్యూబ్ థంబ్‌నైల్స్ కోసమో, సోషల్ మీడియాలో ట్రెండింగ్ కోసమో పనిగట్టుకుని రాసే కథనాలు పరోక్షంగా ఒక నటుడి క్యారెక్టర్ అస్సాసినేషన్ కు దారితీస్తాయి.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో డ్యూయల్ బ్రాండింగ్ రాజకీయం

ఖమ్మం, జూలై 11, రాజకీయాల్లో ఎప్పుడు, ఏ రంగులు ఎవరికి అంటుకుంటాయో ఊహించడం ఎవరి తరం కాదు. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో నడుస్తున్న డ్యూయల్ బ్రాండింగ్ రాజకీయం చూస్తుంటే అలాగే ఉంటుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ప్రత్యర్థులు ఎప్పుడూ టీడీపీ ఖాతాలోనే వేస్తుంటారు. అదే సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై వైసీపీ మార్క్ వేయడానికి ట్రై చేస్తుంటారు. అయితే, ఈ పొలిటికల్ ట్యాగ్‌లు కేవలం మాటలకే పరిమితం కాకుండా.. ఇప్పుడు ఏకంగా అధికారిక సభల ఫ్లెక్సీల సాక్షిగా బట్టబయలు కావడం ఖమ్మం జిల్లాలో పెద్ద హాట్ టాపిక్‌గా మారింది.ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించన రైతు ఆశీర్వాద సభ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలిసి హాజరవుతున్నారు. ఇద్దరూ కలిసి ఒకే వేదికపైకి వస్తుండటంతో, జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు భారీగా ఏర్పాట్లు చేశాయి. అయితే, సభా ప్రాంగణంతో పాటు ఇరువైపులా ఉన్న రోడ్ల పొడవునా వెలిసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు ఇప్పుడు అసలు మ్యాటర్‌ను పక్కనబెట్టి జనాలకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తున్నాయి. ఇద్దరు నేతలకు వారి వారి పాత, కొత్త సానుభూతిపరులు వేర్వేరుగా డిజైన్ చేసిన ఫ్లెక్సీలు కట్టడమే ఇందుకు కారణం.ఒకవైపు రేవంత్ రెడ్డికి స్వాగతం పలుకుతూ స్థానిక టీడీపీ సపోర్టర్లు, పాత మిత్రులు పెద్ద ఎత్తున బ్యానర్లు కట్టారు. రేవంత్ రెడ్డి పొలిటికల్ హిస్టరీని గుర్తుచేస్తూ, ఆయనలోని పాత లీడర్‌ను ఓన్ చేసుకునేలా ఈ బ్యానర్లు ఉన్నాయి. ఇక దీనికి పోటీగా.. మరోవైపు భట్టి విక్రమార్కకు మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సపోర్టర్లు, వైఎస్సార్ అభిమానులు పోస్టర్లు, ఫ్లెక్సీలు వేసి కలరింగ్ ఇచ్చారు. ఒకే కాంగ్రెస్ ప్రభుత్వంలో నంబర్-1, నంబర్-2 స్థానాల్లో ఉన్న ఇద్దరు నేతలకు.. ఇటు తెలుగుదేశం, అటు వైసీపీ శ్రేణులు పోటీ పడి మరీ ఓన్ చేసుకోవడం చూసి, అసలు అక్కడ జరుగుతోంది కాంగ్రెస్ సభేనా? లేక ఆంధ్రప్రదేశ్ పాలిటిక్స్ ఏమైనా షిఫ్ట్ అయ్యాయా? అని స్థానిక రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు.రేవంత్ రెడ్డిని టీడీపీ వాడిగా, భట్టిని వైసీపీ వాడిగా ప్రజలు ముద్ర వేస్తుంటే.. వాటన్నింటినీ భరిస్తూ హస్తం గుర్తు కింద ఇద్దరూ కలిసి పాలిస్తున్నారు. కాస్త ఆలోచిస్తే ఇది కాంగ్రెస్ కు మేలే. అటు టీడీపీ, ఇటు వైసీపీ సానుభూతిపరుల మద్దతు కాంగ్రెస్ కే లభిస్తుంది.

## బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలు అరెస్టు

రంగారెడ్డి షాబాద్ మండలం దైవాలగూడలో పోక్సో నిందితుడి చేతిలో హత్యకి గురైన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళ్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డిలను చేవెళ్ల వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పట్నం నరేందర్ రెడ్డిని శంకర్ పల్లి వద్ద అదుపులోకి తీసుకొని పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసారు.

### కష్ణానదికి చేరని గోదావరి నీళ్లు

పోలవరం ప్రాజెక్టు దిగువన ఉన్న పట్టిసీమ మోటార్ల ద్వారా పంప్ చేసిన గోదావరి జలాలు శనివారం ఉదయానికి కృష్ణానదికి చేరుకున్నాయి. 20 మోటార్ల ద్వారా రోజుకు 7 వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇప్పటివరకు 1.33 టీఎంసీల జలాలను పోలవరం కుడికాలువకు మళ్లించారు.

# పల్లెనిద్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి

## గోనెగండ్ల మైనారిటీ కాలనీలో ఇంటింటికి తాగునీటి కొళాయి కనెక్షన్ల పనులకు ఘనంగా భూమి పూజ

గోనెగండ్ల: ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో ఎప్పుడూ ముందుండే ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి మరోసారి తన నిబద్ధతను చాటుకున్నారు. గతంలో గోనెగండ్ల పట్టణంలోని మైనారిటీ కాలనీలో నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమం సందర్భంగా స్థానిక ప్రజలు తమ కాలనీలో తాగునీటి కొళాయి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఆ సమయంలో ప్రజల సమస్యను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి , "మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీ కాలనీలో ఇంటింటికి తాగునీటి కొళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి మీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాను" అని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన ఆ మాటను నిలబెట్టుకుంటూ, ఎమ్మెల్యే గారి ఆదేశాల



మేరకు నేడు గోనెగండ్ల పట్టణంలోని మైనారిటీ కాలనీలో ఇంటింటికి తాగునీటి కొళాయి కనెక్షన్ల ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించి పనులను ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గోనెగండ్ల మండల టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ఖీచిూ శాఖ అధికారులు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు.మైనారిటీ కాలనీ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న తాగునీటి సమస్యకు ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి చొరవతో శాశ్వత పరిష్కారం లభిస్తోందని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ పనులు పూర్తయిన అనంతరం మైనారిటీ కాలనీలోని ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి వచ్చి, ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయని అధికారులు తెలిపారు.

# బోనాల జాతర కు భారీ బందోబస్తు

సికింద్రాబాద్ లష్కర్ లో జరిగే ఉజ్జయిని మహంకాళి జాతర కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఆగస్టు 2,3 తేదీలలో జరిగే ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు, రంగం కార్యక్రమం సజావుగా సాగేందుకు ఇప్పటినుండే అన్ని ఏర్పాట్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. బోనాలతో వచ్చే మహిళల కోసం ప్రత్యేకంగా రెండు క్యూ లైన్లతో పాటు మొత్తం నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బోనాల ఉత్సవాల కోసం వచ్చే భక్తులకు, మహిళలకు,వయోవృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు వారికి కావలసిన మౌలిక వసతుల కల్పన చేయనున్నట్లు వెల్లడించారు. శాంతి భద్రతల దృష్ట్యా ఆలయ పరిసరాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను పటిష్ట పరుస్తామని అన్నారు. జాతర సమయానికి అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తవుతాయని, ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# భద్రాద్రి రాముడిపై సీఎం రేవంత్ రెడ్డి ఆన..

## నా రాజకీయ ఎదుగుదలకు ఖమ్మమే గుండెకాయ. 2029లో 117 సీట్లతో మళ్లీ మనదే పీఠం!

రాష్ట్రంలో మరోసారి రాజకీయ ప్రకంపనలుముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాలో మరోసారి రాజకీయ ప్రకంపనలు సృష్టించారు. చింతకాని మండలం జగన్నాథపురంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'రైతు ఆశీర్వాద సభ'కు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ వేదిక నుంచి వానాకాలం సీజన్కు సంబంధించిన రైతు భరోసా తుది విడత నిధులు రూ.1009 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లోకి విడుదల చేశారు. ఈ నిధుల విడుదలతో ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం రూ.8,759 కోట్ల పెట్టుబడి సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లయింది. ఇప్పటిదాకా 74 లక్షల మంది రైతులకు చెందిన 1.45 కోట్ల ఎకరాల భూములకు విజయవంతంగా పెట్టుబడి సాయం అందించామని సీఎం ఈ సందర్భంగా ప్రకటించారు.నా రాజకీయ ఎదుగుదలకు ఖమ్మమే గుండెకాయ..సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. "నా రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం జిల్లా ఒక గుండెకాయలాగా నిలిచింది. 2023 జులైలో ఇక్కడ ఒక అద్భుతం జరిగింది. నాటి బీఆర్ఎస్ అహంకార పాలనను కాదని పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆనాడు ఉప్పెనలా జనం కాంగ్రెస్ వైపు వచ్చారు. సరిగ్గా 36 నెలల తర్వాత మళ్లీ అదే జులైలో ఇవాళ ప్రజాపాలనను ఆశీర్వదించడానికి రైతాంగం మళ్లీ ఉప్పెనలా తరలివచ్చింది" అని హర్షం వ్యక్తం చేశారు. "తెలంగాణలో బీఆర్ఎస్‌ను మళ్లీ మొలకెత్తనీయబోమని ఇక్కడి ప్రజలు ఒట్టు పెట్టారు. అందుకే ఆ పాపాల భైరవుడిని ఫాంహౌస్‌లో బంధించారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో వస్తున్నారని, వారిని ఎలా ఎదుర్కొంటావని కొందరు నన్ను అడిగారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని ఆనాడే గంటాపథంగా చెప్పా. మేము అన్నట్టే ఎన్నికల్లో 64 సీట్లు సాధించాం. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో మరో రెండు సీట్లు గెలిచి మా బలాన్ని నిరూపించుకున్నాం" అని గుర్తుచేశారు.భద్రాచలం రాముడిపై ఆన.. 2029లో 117 సీట్లతో మళ్లీ మనదే పీఠం!భవిష్యత్తు ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి భద్రాచలం రాముడి సాక్షిగా సంచలన ప్రతిన పూనారు. "2029 జూన్లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రాష్ట్రంలో పార్లమెంట్ సీట్లు 25కు, అసెంబ్లీ సీట్లు 182కు పెరుగుతాయి. ఆ 182 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే 117 సీట్లు గెలిచి, రెండోసారి సగర్వంగా ప్రజాపాలనను తీసుకొస్తుంది. భద్రాచలం రాముడీ మీద ఆన వేసి చెబుతున్నా.. ఇది కేవలం నా మాట కాదు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పూనిన ప్రతిన" అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# లేబర్ క్యాంపులో గంజాయి విక్రయాలు పోలీసుల అదుపులో ఐదుగురు పెడ్లర్లు



సంగారెడ్డి కొల్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మై హోమ్ సయుక్ నిర్మాణ సంస్థ లేబర్ క్యాంపు లో కార్మికులకు గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు పెడ్లర్లను పోలీసులు అరెస్ట్ చేసారు. బీహార్ రాష్ట్రం నుండి గంజాయిని తీసుకవచ్చి అమ్మేందుకు ప్రయత్నిస్తుండగ 5.5 కిలోల గంజాయి స్వాదీనం చేసుకున్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన నిందితుల్లో ప్రధాన నిందితుడు అస్సదుల్లా పరారులో ఉండగా మిగతా నలుగురు ఎండి కైఫ్, ఎండి సైఫ్, ఎండి తుఫెల్, ఎండి ఖలీమ్ లపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

## సిద్దిపేట ఎల్వి ప్రసాద్ ఆసుపత్రి ప్రజల కంటికి రక్షణ కవచం..

## మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



సిద్దిపేట హరీష్ రావు మాట్లాడుతూ ఎల్వి ప్రసాద్ ఆసుపత్రి ని సద్వినియోగం చేసుకోవాలి ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే నిజమైన అభివృద్ధి నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో ఎల్వి ప్రసాద్ సేవలు అందించాం.డ్రైవర్లు కంటి పరీక్షలు చేపించుకోవాలిఉచితంగా కంటి పరీక్షలు, అద్దాలు ఇప్పించే బాధ్యత నాదిసిద్దిపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నాం.సిద్దిపేట క్యాంపు కార్యాలయం లో ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ వారికి ఉచితంగా కంటి పరీక్షలుపాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయం లో ఆటో ఎలెక్ట్రికల్ అసోసియేషన్ వారికి ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యం తో ఉచితంగా కంటి పరీక్షల కార్యక్రమం లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. సిద్దిపేట జిల్లా కు చెందిన పేద ప్రజలకు కంటి పరీక్షలు, అవసరమైన ఆపరేషన్లు పూర్తిగా ఉచితంగా నిర్వహించాలని ఉద్దేశ్యం తో సిద్దిపేట లో ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ని ఏర్పాటు చేసుకున్నామని ఆర్థికంగా సామర్థ్యం ఉన్నవారు చెల్లించవచ్చు, కానీ పేదలకు మాత్రం ఎలాంటి భారం లేకుండా చికిత్స అందించేందుకు ఆసుపత్రి ఎంతో ఉపయోగ పడుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. హైదరాబాద్‌కు వెళ్లే స్థోమత లేని ఎంతో మంది మన మధ్య ఉన్నారు. అలాంటి వారికి ఇక్కడే నాణ్యమైన వైద్యం అందించాలన్నదే ఈ కేంద్రం ప్రారంభించిన ముఖ్య ఉద్దేశం. ఇప్పటికే అనేక మందికి చికిత్సలు, ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. ముఖ్యంగా మోటార్‌బైక్, బస్సు డ్రైవర్లు, మెకానిక్‌లు, ఎలక్ట్రిషియన్‌లు వంటి వృత్తుల వారికీ ఈ సేవలు ఎంతోఉపయోగ పడుతున్నాయి.40 ఏళ్ల వయస్సు దాటిన తర్వాత చాలామందికి కంటి సమస్యలు వస్తుంటాయి. కానీ చాలా మంది పరీక్షలు చేయించుకోవడాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. అందుకే ప్రతి ఒక్కరూ తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలి.

## జిల్లా పెయింటర్ అసోసియేషన్

## నూతన కార్యవర్గం ఎన్నిక



పెద్దపల్లి :పెద్దపల్లి జిల్లా పెయింటర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలో నియామకం చేసుకున్నారు. ఇందులో గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ మంద భాస్కర్ యాదవ్, జిల్లా అధ్యక్షులుగా నాంసాని నర్సయ్య, ఉ పాధ్యక్షులుగా దావల్ల రవి,అరికోల్ల వెంకటేష్, బండారి శ్రీనివాస్, సెక్రటరీగా మినుముల సది, క్యాషియర్లు గా చంద్రగిరి సుమన్, పల్లె విజయ్, సలహాదారులుగా మెంగని నాగరాజు, తాడం ప్రసాద్, గడ్డం శంకర్, గరిగంటి రాజేందర్, మహ్మద్ తాజ్, ఆర్గనైజర్లుగా శనిగరం నాగరాజు, గడ్డం లక్ష్మణ్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షులు నాంసాని నర్సయ్య మాట్లాడుతూ ఇన్నేళ్ల తర్వాత పెయింటర్లం దరూ ఏకతాటిపైకి రావడం గర్వకారణమని, భవన నిర్మాణ రంగ కార్మికులంతా అన్నదమ్ముల్లా ఐక్యంగా ఉంటూ ఒకరికొకరు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తమ వృత్తికి, ఇంటి యజమా నులకు తగిన గౌరవాన్ని ఇస్తూనే, సభ్యుల సమస్యల పరిష్కారానికి, సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నా రు. అనంతరం ముఖ్యఅతిథి గా హాజరైన మార్బుల్ అండ్ టైల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కల్లపెల్లి రవి నూతన కమిటీని సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతూ,ఈ ఐక్యత భవిష్యత్తులో పెయింటర్ల హక్కుల సాధనకు,అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన పెయింటర్లు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత:

## బొమ్మరవేణి తిరుమల తిరుపతి:



రామడుగు: :రామడుగు మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబ సభ్యులు జిట్టవేణి అంజయ్య శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు.మృతి చెందిన విషయం తెలుసుకున్న గోపాలరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల తిరుపతి వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు మనో ధైర్యం చెప్పి అంజయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కారుపాకల నరేష్ మామిడి నర్సయ్య బోయిని బాలయ్య పెసరి ఎల్లయ్య జిట్టవేణి రమేష్ జిట్టవేణి రాజు జిట్టవేణి రాకేష్ తదితరులు ఉన్నారు.

## ఏడు బృందాలతో నిందితుడి వేట సీపీ తరుణ్ జోషి

రంగారెడ్డి షాబాద్ మండలం దైవాలగూడలో జరిగిన ఆరుగురి హత్యలనై ఫ్యూచర్ సిటీ సిపి తరుణ్ జోషి స్పందించారు. రాత్రి హత్య జరిగినట్లు మాకు సమాచారం వచ్చింది. రెండు ప్లేస్ లలో హత్య జరిగింది. మొదట షాబాద్ లోని భాధితురాలి ఇంట్లోకి రాత్రి 11 గంటలకు వెళ్ళాడు. అక్కడ భాధితురాలి తల్లి, నానమ్మ ను హత్య చేసాడని అన్నారుజనిందితుడు రాజ్ కుమార్ పై మే 16 న ఫోక్సో కేసు నమోదు అయ్యింది.. ఈ కేసులో అతనికి బెయిల్ దొరికింది.. అతనికి భార్య.. ఇద్దరు పిల్లలు ఉన్నారు.. భాధితురాలికి తల్లి, నానమ్మ ఉన్నారు. కత్తి తో తల్లి ని నానమ్మ ను చంపాడు. ఆ తరువాత బాలికను నగర్ కుంట దగ్గరికి తీసుకెళ్లి చెరువు దగ్గర హత్య చేసాడు. ఆ తరువాత తన ఇంటికి వెళ్లి తన భార్య, పిల్లలను చంపాడు. రాజ్ కుమార్ తల్లిదండ్రులకి కాల్ చేసి నేను అరుగురిని చంపాను... నేను కూడా చనిపోతున్నాను అని చెప్పాడు. మృతదేహాలను ఆసుపత్రి కి తరలించాము.. రాజ్ కుమార్ ప్రస్తుతం పరారి లో ఉన్నాడు? ఏడు పోలీసు బృందాలు నిందితుని కోసం గాలింపు చేపట్టాయిని వెల్లడించారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి :

## గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్



**పెద్దపల్లి/గోదావరిఖని, జూలై-11, ప్రజాబలం ప్రతినిధి :** విద్యార్థులు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని మంథని పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మంథని గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, పిల్లలను సరైన మార్గంలో తీర్చిదిద్దే బాధ్యత కేవలం పోలీసులు, ఉపాధ్యాయులు లేదా వైద్యులదే కాదని, అందులో అత్యంత కీలకమైన పాత్ర తల్లిదండ్రులదేనని అన్నారు.పిల్లల వ్యక్తిత్వ నిర్మాణం కుటుంబం నుంచే ప్రారంభమవుతుందని, చిన్నప్పటి నుంచే మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవర్చాలని సూచించారు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లలను గట్టిగా మందలిస్తే ఇంటి నుంచి వెళ్లిపోతారేమో లేదా ఏదైనా అఘాయిత్యానికి పాల్పడతారేమో అనే భయంతో అవసరమైన క్రమశిక్షణను పాటించడంలో వెనుకడుగు వేస్తున్నారని తెలిపారు. పిల్లలు కొన్నిసార్లు అలాంటి మాటలతో తల్లిదండ్రులను భయపెట్టే ప్రయత్నం చేస్తారని, అలాంటి బెదిరింపులకు భయపడకుండా ప్రేమతో పాటు క్రమశిక్షణతో వారిని సరైన మార్గంలో నడిపించాలని సూచించారు.తల్లిదండ్రులు ప్రతిరోజూ పిల్లలతో మాట్లాడాలని,వారి స్నేహితుల వర్గం, మొబైల్ ఫోన్ వినియోగం, సామాజిక మాధ్యమాల వినియోగంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. తల్లిదండ్రుల అప్రమత్తత,ప్రేమ, మార్గదర్శకత్వంతోనే పిల్లలను చెడు అలవాట్ల నుంచి కాపాడవచ్చన్నారు.

మత్తు పదార్థాల అలవాటు విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తుందని,వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాలను అవసరమైన మేరకే వినియోగించాలని, అధిక వినియోగం వల్ల చదువుపై ఏకాగ్రత తగ్గడంతో పాటు మానసిక ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు.ప్రస్తుతం సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో అపరిచితుల ఫోన్ కాల్స్,సందేశాలు, లింకులు,నకిలీ వెబ్‌సైట్లు,ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత బ్యాంకు వివరాలు,ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎవరికీ వెల్లడించవద్దని, అనుమానాస్పద సంఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు లేదా సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని కోరారు.విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో చదువుకుని సమాజానికి ఆదర్శప్రాయమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మంథని ఎస్ఐ, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జ్యోతి గాంధీ స్మారక పురస్కారం అందజేసిన

## ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్




**పెద్దపల్లి/గోదావరిఖని, జులై -11, ప్రజాబలం ప్రతినిధి :** మహిళా మణికి జ్యోతి గాంధీ స్మారక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ జ్యోతి గాంధీ స్మారక పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. జ్యోతి గారి చిత్రాటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ



సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడారు. అనంతరం స్థానిక యువత వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచి గోదావరిఖని ప్రాంతానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, ఆర్జీవన్ జీఎం లలిత్ కుమార్, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదు..రవి సింగ్



**కూకట్పల్లి (ప్రజాబలం ) జులై 11** :కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట్ చౌరస్తా లోని సీతమ్మ చాపల పులుసు హోటల్లో" పప్పు అనే కార్మికుడు హోటల్లో పని చేసేవారు, హోటల్ యజమాన్యం పప్పుకి గత నెల వేతనం రావాల్సి ఉండగా సీతమ్మ చాపల పులుసు హోటల్ యజమాన్యం అతన్ని పట్ల నిర్లక్ష్యం చేస్తూ అతనికి వేతనం ఇవ్వకుండా మాయమాటలు చెప్పి అతని ఇబ్బంది పెట్టేవారూ, అడిగి అడిగి విసుగు చెందిన పప్పు అనే కార్మికుడు కి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే కార్మికులకు న్యాయం చేస్తారని తోటి కార్మిక మిత్రుల ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన మూసాపేట్ చౌరస్తా లో ఉన్న హోటల్ యజమాన్యం దగ్గరికి వెళ్లి కార్మికుడు పప్పు కి రావాల్సిన వేతనం ఇప్పించడం జరిగింది.కార్మికుడు పప్పు మాట్లాడుతూ నాకు మా కుటుంబానికి న్యాయం చేసిన కార్మికనాయకుడు రవి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో, సంతోష్ గౌడ్ సుదర్శన్, జగన్, కిరణ్, పాల్గొన్నారు.

## మంత్రి సీతక్క ఆదేశాలతో పలు శుభకార్యాలకు హాజరైన జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు





**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 11**బిరాష్ట్ర మంత్రివర్యులు దనసరి అనసూయ సీతక్క గారి ఆదేశాల మేరకు, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు పలు శుభకార్యాల్లో పాల్గొంటూ ప్రజలకు మరింత చేరువ అవుతున్నారు

బిఈ సందర్భంగా ఏటూరునాగారం మండలంలోని కోయగూడా--ఎల్లాపూర్ రాంనగర్ గ్రామానికి చెందిన గార మహేష్ కుమార్తెలు తరుణిక, అఖిలల ఓణీ అలంకరణ శుభకార్యానికి హాజరై చిన్నారులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

బిఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని, భగవంతుడు వారికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, విద్యాభివృద్ధి, మంచి ఉద్యోగం ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు. సమాజంలో ఆడబిడ్డలకు గౌరవం, ప్రాధాన్యత ఇవ్వాలని, వారి విద్యాభివృద్ధికి ప్రతి కుటుంబం కృషి చేయాలని సూచించారు.

బిఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎండి ఖలీల్ ఖాన్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు చేల వినయ్, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపడ్ల రవి, జయకృష్ణ, బుల్లె పెద్దన్న, పాల్తీయ మోహన్, ప్రశాంత్, గడబోయిన శ్రీకాంత్, బాలకృష్ణ, రవి, భూమయ్య తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## సర్ ప్రక్రియ పారదర్శకంగా,వేగంగా పూర్తి చేయాలి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి, జూలై 11 (ప్రజాబలం):** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలాజీనగర్ వార్డు కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఫారాల పంపిణీ, స్వీకరణ సక్రమంగా జరుగుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి, అందిన ఫారాలను వెంటనే డిజిటలైజ్ చేయాలని, ఆ ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఓటర్లకు ఫారాలు పూరించడంపై పూర్తి అవగాహన కల్పించి అవసరమైన సహాయం అందించాలని బీఎల్‌వోలకు ఆదేశించారు.

అందుబాటులో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి ఫారాలు అందజేయాలని, వారి వివరాలను సూపర్‌వైజర్లకు తెలియజేయాలని సూచించారు. 2002 తర్వాత జన్మించిన ఓటర్లకు సంబంధించిన ఫారాల భర్తీపై కూడా సీఈవో మార్గనిర్దేశం చేశారు. అనంతరం కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లోని అపార్ట్‌మెంట్లు, ఇండో ఫార్చ్యూన్ గ్రేటర్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లను పరిశీలించి ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు.

పర్యటనలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, ఎమ్మార్వో అశోక్, డీసీ ఆంజనేయులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## తుమ్మలపల్లి జన గణన సర్వేలో పాల్గొన్న మన్నె పాండు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జూలై 11 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం తుమ్మలపల్లి గ్రామంలో ప్రజా జన గణన సర్వేలో పాల్గొన్న ప్రజానేత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మన్నే పాండు మా గ్రామ అభివృద్ధి నా సంతోషం మా గ్రామ ప్రజలే నా బలం అందుకు నేను నా వంతుగా ఎంతైనా కృషి చేస్తాను అని తెలిపారు జనగణన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చేసి అధికారులకు అందించాలి అని తెలిపారు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి ఒకే దగ్గర నమోదు చేసుకోవాలి అందువలన ప్రభుత్వ పథకాలు గాని ప్రభుత్వ అవకాశాలు కానీయండి మనం సద్వినియోగం చేసుకోవచ్చు కాబట్టి 100% ప్రతి ఒక్కరు నమోదు కార్యక్రమాన్ని అందరూ విజయవంతంగా పూర్తి చేసుకోవాలని మన్నే పాండు , ఉప సర్పంచ్ సురేష్ ,గ్రామ ప్రజలకు సర్వే పై అవగాహన కల్పిస్తూ కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలిపారు

## సింగపూర్ కు తిరుపతి మామిడి...

తిరుపతి, జూలై 11, ఆంధ్ర మామిడి పండ్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో రకం ఫేమస్. నూజివీడు రసాలు, ఉలవపాడు మామిడికాయ, చిత్తూరు తోతాపురి, ఇక బంగినపల్లి గురించయితే అస్సలు చెప్పాల్సిన అవసరం లేదు. ప్రపంచ వ్యాప్తంగా మన మామిడి పండ్లకి యమా గిరాకీ ఉంది. తాజాగా సింగపూర్‌కు మన మామిడి పండ్లను టన్నుల కొద్దీ ఎగుమతి మొదలైంది. సీఎం చంద్రబాబు నాయుడు నియోజకవర్గం నుంచే ఈ ఎగమతి మొదలవ్వడం విశేషం.చిత్తూరు జిల్లాలో తోతాపురి, బంగినపల్లి మామిడి కాయలు ఎక్కువ కాపు కాస్తాయి. కర్ణాటక పరిధిలోని చింతామణి ప్యాక్ హౌస్ నుంచి ఐదు టన్నుల మామిడి పండ్లతో ఉన్న కంటైనర్ చెన్నై ఓడరేవుకు బయల్దేరింది. భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, సీఐఎస్‌హెచ్ సహకారంతో బంగినపల్లి, తోతాపురి మామిడి పండ్లను నౌక ద్వారా సింగపూర్‌కు పంపుతున్నట్లు ఓసమ్ ఫుడ్స్ డైరెక్టర్ వ్యవసాయ పారిశ్రామికవేత్త కోటేశ్వరరావు తెలిపారు.కుప్పం నియోజకవర్గంలోని మండలాలతో పాటు పలమనేరు నియోజకవర్గంలోని వి.కోట మండల రైతుల నుంచి సేకరించిన మామిడిని సింగపూర్‌కు పంపినట్లు వారు తెలిపారు. ఈ మామిడి పండ్లను మొత్తాన్ని ఓ కంటైనర్‌లో ఉంచి, షిప్‌లో సింగపూర్‌కు పంపుతున్నారు. మామిడి పండ్లు సింగపూర్‌కి చేరుకోవడానికి 12 రోజుల సమయం పడుతుంది.

## నేతాజీ నగర్ లో పర్యటించిన ఎమ్మార్వో



**శేర్లింగంపల్లి (ప్రజాబలం ప్రతినిధి నరేష్ )జూలై 11**ఇంటి ఇంటికి తిరిగి ఓటర్ నమోదు చేయాలని కోరిన బేరీ రాశీచందర్ యాదవ్ శేరిలింగంపల్లి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ నమోదు ప్రక్రియ లో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బస్తీలో చాలా మంది నిరుపేదలు నివసిస్తున్నారు. కాబట్టి వారికి చదువు రాకపోవడంతో ఫారాలు నింపడం లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ కాలని అద్యక్షుడు బేరి రాశీచందర్ యాదవ్ అన్నారు. ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. ఆయన కోరిక మేరకు



నేతాజీ నగర్ కాలనీలో ఓటర్ నమోదు కార్యక్రమం పై అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం రోజు శేరిలింగంపల్లి ఎమ్మార్వో మహిపాల్ రెడ్డి కాలనీలో పర్యటించి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికి తిరిగి నమోదు చేయాలని బిఎల్ఎ, బిఎల్ఓ లకు వివరించారు. కాలనీ అధ్యక్షులు రామచందర్ యాదవ్ మాట్లాడుతూ అధికారులు చొరవ తీసుకుని ప్రజలకు సహకరించాలని, ప్రజల అనుమానాలను నివృత్తి చేస్తూ ఓట్లు గల్లంతు కాకుండా చూడాలన్నారు. అవసరమైతే అధికారుల ను పెంచాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎలక్షన్ అధికారి దీపక్ కుమార్, బి ఎల్ ఓ పరమేష్ కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, బుడగ జంగాల పంతం వెంకటేష్, పంతం శీను, నాగపురి నగేష్ యాదవ్, ఎండి జాఫర్, శివ యాదవ్, మరియు నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ సభ్యులు కాలనీ పెద్దలు మహిళా సోదరుల యోజన నాయకులు పాల్గొన్నారు ఓటు మన హక్కు ఓటు నమోదు కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలి బేరి రామచందర్ యాదవ్

## గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జోనల్ అధికారి అపర్ణ



**సత్తుపల్లి ప్రతినిధి జూలై 11ప్రజాబలం:** కల్లూరు మండలం, కల్లూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను జోనల్ అధికారి (జెడ్‌వో) అపర్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు.

ఈ సందర్భంగా పాఠశాల పరిసరాల పరిశుభ్రత, వసతి గృహాలు, డైట్ మెనూ, భోజన నాణ్యత, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా ముచ్చటించి వారి చదువులు, సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

తర్వాత నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో అపర్ణ మాట్లాడుతూ, విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల బాధ్యత కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. పిల్లలు మొబైల్ ఫోన్లు, యాప్‌లకు ఎక్కువగా అలవాటు పడకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న "మైండ్ స్పార్క్" కార్యక్రమం ద్వారా విద్యార్థుల భవిష్యత్ ప్రణాళిక, నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన నడవడికను కూడా పిల్లలకు అలవర్చాలని సూచించారు.

పేరెంట్స్ కమిటీ, అధ్యాపకులు ప్రస్తావించిన సమస్యలపై స్పందించిన ఆమె, కోతుల బెడద నివారణకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు అవసరమైన వాష్‌రూమ్ సౌకర్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అనంతరం బోధన సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ నాణ్యమైన బోధన అందించాలని, విద్యార్థుల చదువుతో పాటు వారి నడవడిక, మానసిక స్థితిపై కూడా నిరంతరం దృష్టి పెట్టాలని చెప్పారు. వర్షాకాలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

పాఠశాల సందర్శన అనంతరం అక్కడి విద్యా వాతావరణం, బోధన, డైట్ మెనూ, పరిశుభ్రత సంతృప్తికరంగా ఉన్నాయని జోనల్ అధికారి అపర్ణ పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కనకదుర్గతో పాటు బోధన, బోధనేతర సిబ్బందిని అభినందించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఆర్డీవో దేవూజా



**జహీరాబాద్, జూలై 11 ప్రజాబలం ప్రతినిధి :** జహీరాబాద్ మునిసిపల్ పరిధిలోని 27వ వార్డులో గల 174 వ పోలింగ్ స్టేషన్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను జహీరాబాద్ ఆర్డీవో దేవూజా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో చేపడుతున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను నిబంధనల మేరకు స్వీకరించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్, బీఎల్‌వో వసియా ప్రవీణ్, ఆర్‌పీ లక్ష్మి, బీఎల్ఏలు నరేష్‌రెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంగా మారిన163 జాతీయరోడ్లు



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 11**ములుగు జిల్లా 163 వ జాతీయ రహదారి ప్రతిరోజు ప్రమాదంగా మారుతుంది వందల వాహనాలు ప్రతిరోజు రోడ్డుపై వెళుుండడంతో గుంతలు పడ్డ రోడ్లు రోజుకు రోజుకు పెరిగిపోయి వాహనదారుల ప్రాణాలకు ప్రమాదంగా మారుతుంది ముఖ్యంగా ఏటూరునాగారం నుండి ముళ్లకట్ట వెళ్లే 163 జాతీయ రహదారి హనుమాన్ జంక్షన్ నుంచి ఏటూరు నాగారం బస్టాండ్ వరకు క్రాస్ రోడ్ నుంచి మంగపేట వరకు మూలమలుపులతో రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి కనబడుతుంది ముఖ్యంగా ఇసుక లారీలు ఎక్కువగా తిరగడంతో వాహనదారులకు ప్రమాదాలు ఎదురయ్యే పరిస్థితి కనబడుతుంది రాత్రి వేళలో ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరిచేతులో పెట్టుకొని ప్రయాణాలు చేయవలసిన పరిస్థితి కనబడుతుంది తక్షణమే అధికారులు చర్యలు తీసుకుని 163 జాతీయ రహదారిపై గుంతలను పూడ్చి ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని వాహనదారు కోరుకుంటున్నారు



# పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

## 25 మందికి రూ.11.27 లక్షల చెక్కుల పంపిణీ



**జహీరాబాద్, జూలై 11 ప్రజా బలం ప్రతినిధి:** పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థిక భరోసాగా నిలుస్తోందని మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. ఏ. చంద్రశేఖర్ తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు జహీరాబాద్ నియోజకవర్గంలోని జహీరాబాద్, న్యాల్కల్, కోహీర్, ఝరాసంగం మండలాలకు చెందిన 25 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.11,27,500 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన నిరుపేదలు ఖర్చు వివరాలతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తోందన్నారు. ఈ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కోహీర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, మండల అధ్యక్షుడు హుగ్గెల్లి రాములు, సువర్ణ--మల్లన్న పాటిల్, పవన్ రాథోడ్, పట్టణ అధ్యక్షుడు నరేష్ గౌడ్, ముజాఫ్ఫర్, మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, మాజీ పట్టణ అధ్యక్షుడు కండేం నర్సింలు, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, కౌన్సిలర్లు మహేష్, శిరీష రాణి, శ్రీకాంత్, సర్పంచ్ రాజ్‌కుమార్, చిన్నా హైదరాబాద్ ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హుగ్గెల్లిలో ఎస్ఐఆర్‌పై అవగాహన.



**జహీరాబాద్, జూలై 11 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ మండలం హుగ్గెల్లి గ్రామంలో సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎస్ఐఆర్ ఫారాల పూరింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులకు ఫారాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎలా నింపాలనే అంశంపై వివరించి, ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు.

కార్యక్రమంలో సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ దరఖాస్తులను సక్రమంగా నింపి సమర్పించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ సందేహాలను నివృత్తి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాములు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి, ఆర్ఐ, బీఎల్‌వోలు, బీఎల్ఏలు, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# 13న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూలై 11:** జిల్లాలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం (ఎన్‌డీడీ) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 13న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం, 20న మాప్--అప్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు.

జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, యువతకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సమాజ స్థాయిలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 1--2 సంవత్సరాల పిల్లలకు అర మాత్రను పొడి చేసి నీటితో, 2--3 సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్రను పొడి చేసి నీటితో ఇవ్వాలని సూచించారు. జిల్లాలో అర్హులైన ప్రతి బాలబాలికకు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డా. ఆనంద్ సూచించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ఆరోగ్య, విద్య, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు.

# బుచ్చనెల్లిలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ



**జహీరాబాద్, జూలై 11 ప్రజా బలం ప్రతినిధి:** జహీరాబాద్ మండలంలోని బుచ్చనెల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.జీ. రాములు ముఖ్య అతిథిగా హాజరై గ్రామ కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు, పెన్షన్లు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియను పరిశీలించి, పంచాయతీ కార్యదర్శి, బీఎల్‌వోలు, బీఎల్ఏలు త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో బుర్దిపాడ్ సర్పంచ్ మల్లికార్జున్, కిషన్‌రావు కులకర్ణి, కిషన్ రాథోడ్, అలెగ్జాండర్, తుకారాం, లాజర్, మహేష్, పోచప్ప, నారాయణ, బోగిని లక్ష్మిమాణ, ప్రకాష్, చిన్న, తిమోతి, అశోక్, రియాజ్, రఫీ, రాంశెట్టి మలేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్ తోడ్పటుకు అనూహ్య స్పందన



**గండిపెట ప్రజాబలం ప్రతినిధి 11 జులై 2026**ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) జరుగుతున్న విధి విధానాలలో బూతులెవల్ అధికారుల పాత్ర ఎంత కీలకమో – ప్రజల పాత్ర కూడా అంతే కీలకం కాగా, చాలా మంది తమ వద్ద ప్రస్తుతం ఓటర్ కార్డు ఉన్నది కావున తాము మళ్లీ ఈ ఫారమ్ లు నింప వలసిన అవసరం లేదనె ధీమాతో ఉన్నారు. వాస్తవానికి రాబోయే కాలంలో ఓటు హక్కు వినియోగించు కొవడానికై ప్రస్తుతం బి ఎల్ ఒ ల వద్ద ఫారమ్ తీసుకుని ప్రతి ఓటర్ 2002 లోని తమ ఓటు లేదా తమ పెద్దల ఓటుతో ప్రస్తుత ఓటును జత కలుపడం (మ్యాపింగ్ చేసుకొవడం) ద్వారా తప్పని సరిగా ఓటర్ జాబితా సవరణ పూర్తి చేసి నిస్సందేహంగా నింప వలసినధే. ఇకపోతే కొంత మంది బి ఎల్ ఒ లు ఇంటింటికీ తిరిగి మరీ ఓటర్ లను కలువడం హర్షనీయమే, వాటిని పూరించడానికి స్థానికులు కాస్త ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో, అట్టి సమస్య పరిష్కార నిమిత్తం ప్రజల సహాయార్థం మేము చేపట్టిన సహకారాలకు స్పందన ఉన్నను, చాలా మంది స్థానిక ప్రజలు ఫారమ్ లు పొందలేక అసంతృప్తిని వెళ్ల బుచ్చు తున్నారు. అట్టి వారికి కూడా పోలింగ్ కేంద్రాల బి ఎల్ ఒ ల మొబైల్ నెంబర్ మరియు ఇతర సమాచారం మేము అందించ గలము. కొంత మంది బి ఎల్ ఒ లు మాత్రం నిమ్మకు నీరెత్తకుండా, ఇంటింటికీ తిరగకుండా కుంటి సాకులు చెబుతూ పూట గడుపు తున్నారు మరి కొందరు ఓటర్ లు తాము ఫోన్ ద్వారా సమాచారం అందించినను నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు సంబంధిత ఫారంలు మీరే వచ్చి తీసుకోవాలని లేనిపక్షంలో మీ ఓటు హక్కు కోల్పోతారని తెలియ చేయడం బాధా కరమన్నారు. కొందరేమో ఒక్కటే ఫార్మ ఇచ్చి, నింపి తీసుకు రండి రెండవది ఇస్తామని చెప్పి తమ చుట్టూ త్రిప్పు కొంటున్నారు, పరిష్కారంగా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయి పర్యటనగావిస్తు, ఇలాంటి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్న బి ఎల్ ఒ లను కర్తవ్య నిర్వహణ పాటించమనీ ఆదేశాలు జారీ చేయవలెనని డిమాండ్ చేస్తున్నాము. స్థానిక మణికొండ, నెక్నంపుర్ డివిజన్ పౌరులు మీరు ఇబ్బంది పడకుండా ఫారమ్ లు పూరించడానికి, మీరిచ్చే సమాచారం మేరకు 2002 లో మీ ఓటు లేదా కుటుంబ పెద్దల ఓటు వెతికి పెట్టడానికి, పోలింగ్ కేంద్రాల బి ఎల్ ఒ ల మొబైల్ నెంబర్ తెలియ చేయడానికి మా వంతు సహకారం ఉంటుందని గుట్టమీది నరేందర్, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, భాను చందర్, సుమనళిని, రాజేంద్ర ప్రసాద్, షేక్ ఆరిఫ్, బిందు, దేవి ప్రియ, శ్రీనివాస్, తిరుపతిలు తెలిపారు, ఇట్టి ప్రజాహిత కార్యక్రమంనకు అనూహ్య స్పందన ఉందని, చిత్తశుద్ధితో మేము చేస్తున్న సేవలను ప్రజలందరూ వినియోగించు కోవాలని కొరడమైనది.

# గుద్దిమల్కాపూర్ మార్కెట్ తరలింపు యోచనను విరామించుకోండి



హైదరాబాద్ నగరంలోని గుడ్డిమాల్కపూర్ వ్యవసాయ కమిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్ మరియు పూల మార్కెట్లను రంగారెడ్డి జిల్లా అజీజ్ నగర్ కు తరలించే ప్రక్రియను విరామించుకోవాలి అని హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసద్దుద్దీన్ ఓవైసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు.ఈ మేరకు గుద్దిమల్కాపూర్ వెజిటేబుల్ మార్కెట్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం పి అసదుద్దీన్ ఓవైసి ని ఎం పి దారుసల్లం లోని పార్టీ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందచేశారు.అసోసియేషన్ ప్రతినిధుల అభ్యర్థన మేరకు ఎం పి అసదుద్దీన్ ఓవైసి సి ఎం రేవంత్ రెడ్డి కి గుద్దిమల్కాపూర్ మార్కెట్తరలించవద్దు అని లేఖ రాశారు.తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సుమారు 10 వేల మందికి పైగా స్థానిక వ్యాపార కుటుంబలకు జీవనోపాధి కల్పిస్తున్న గుద్దిమల్కాపూర్ వెజిటేబుల్ మరియు ఫ్లవర్ మార్కెట్లను తరలించే యోచనను విరామించుకోవాలి అని లేఖలో ఆయన సి ఎం రేవంత్ రెడ్డి ని కోరారు.అసద్దుద్దీన్ ఓవైసి ని కలిసిన వారిలో వెజిటేబుల్ మార్కెట్ అధ్యక్షులు స్వరూప్ కుమార్ జిస్వాల్,ప్రధాన కార్యదర్శి మాణిక్ ప్రభు,ఫ్లవర్ మార్కెట్ చైర్మన్ ఫహీమ్ పాషా కార్యదర్శి అక్రమ్ తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు..



# భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి

# మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### మార్చి 2027 నాటికి మూడు విడతల్లో పూర్తి చేయాలని ఆదేశం
### సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి
### కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖ మంత్రి స్పష్టీకరణ




**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై 11 ప్రజాబలం:**భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై మంత్రి శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ఖమ్మం నుంచి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఈ సమీక్షలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, అయితే చట్టం అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని అంగీకరించారు. భూ భారతి సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని, శుక్రవారమే ముఖ్యమంత్రి ములుగుమాడు గ్రామ రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తుచేశారు.

మార్చి 2027 నాటికి మూడు విడతల్లో..

రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో భూ రీ-సర్వేను పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, దీనిపై ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షిస్తామని మంత్రి తెలిపారు. తొలి విడతలో భాగంగా ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే చేపట్టినట్లు చెప్పారు. ఇందుకోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అయితే వీరికి ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 కలిపి మొత్తం రూ.60 అందజేస్తామని, విధుల్లో చేరని వారికి గడువిచ్చి లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు.

సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణపై ఆరా. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి,



హైకోర్టు సమస్యను కూడా పరిష్కరించినప్పటికీ.. అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందని మంత్రి పేర్కొన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి, నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీ-సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, ఒక సర్వే నంబరులో కొంత భూమిని ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత (22ఏ) జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

గుడిసెల్లో నివసించే వారికే తొలి ప్రాధాన్యం.

మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, నిధులు విడుదలైనా పనులు చేపట్టని చోట్ల బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి, మిగిలిన పనులకు నిధులు విడుదల చేయాలన్నారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేయాలని, ఇందులో గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రానున్న ఆగస్టు 15 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా విద్యాశాఖ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

# AVOPA పుప్పాలగూడ శాఖ ఆధ్వర్యంలో మణికొండ పరిషత్ ప్రాథమిక పాఠశాలకు TV బహుకరణ




ఈరోజు శ్రీ వాసవీ మాత ఆశీస్సులతో మేము అవోపా పుప్పాలగూడ కుటుంబ సభ్యులు మణికొండ పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ాఖఎంబఅస్త్ర 43µinch smart ుఎని అందించాము.

ఈ కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది ముఖ్య అతిథిగా హాజరై, అవ్వోప పుప్పలగూడ యూనిట్ సభ్యులతో కలిసి శాంసంగ్ ఎల్ఈడీ టీవీని ప్రారంభించారు.

శంకర అన్నా, బాలలత ఐఏఎస్ మేడమ్ స్ఫూర్తిదాయకమైన కథ గురించి ఉపాధ్యాయులు మరియు విద్యార్థులతో పంచుకునారు. ప్రభుత్వ పాఠశాల పిల్లలు విభిన్న నేపథ్యాల నుండి వస్తారు కాబట్టి, ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుల కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కువగా కష్టపడాల్సి వుంటుంధి

పిల్లలకు స్ఫూర్తిదాయకమైన కథల గురించి చెప్పమని ఆయన ఉపాధ్యాయులతో అన్నారు.

అవొప పుప్పలగూడ యూనిట్ అధ్యక్షుడు దారం వేణు మాధవ్, పిల్లలు మరియు ఉపాధ్యాయులు స్మార్ట్ టీవీని అభ్యసనం కోసం ఉపయోగించుకోవాలని, అలాగే పాఠశాలలోని వివిధ సందర్భాలలో దానిని వినియోగించుకోవాలని ఉపాధ్యాయులను కోరారు.

అవొప పుప్పలగూడ యూనిట్ అధ్యక్షుడు దారం వేణు మాధవ్, పిల్లలు మరియు ఉపాధ్యాయులు స్మార్ట్ టీవీని అభ్యసనం కోసం ఉపయోగించుకోవాలని, అలాగే పాఠశాలలోని వివిధ సందర్భాలలో దానిని వినియోగించుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. ఇ ప్రోగ్రాం స్కూల్ టీచర్లు అందరు హాజరయ్యారు అయ్యరు.ఈరోజు కార్యక్రమానికి పుప్పాలగూడ యూనిట్ సభ్యులు దారం భానుచందర్ ప్రధాన కార్యదర్శి, , అప్పని యుగేందర్ కోశాధికారి, జె. సాయిరామ్ , ఆర్ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి, పందిరి కృష్ణ , పబ్బా మల్లేశం, దారం మల్లయ్య గారు, బచ్చు రాము , భాస్కర్ గారు,

కోటోరి ప్రకాష్ గారు, బాల రాజయ్య గారు, షీలా కృష్ణ మూర్తి గారు, టి నరేష్ , జి నరేష్ , అంధూరు ఈ కార్యక్రమంలో పాల్గొన్నరు.

ధన్యవాదాలు,

దారం వేణు మాధవ్ , అవోపా పుప్పాలగూడ యూనిట్ అధ్యక్షుడు దారం భానుచందర్ , ప్రధాన కార్యదర్శి అప్పని యుగేందర్ , కోశాధికారి.

# మంజీరా నదిలో దూకి మహిళ మృతి



**జహీరాబాద్, జూలై 11 ప్రజా బలం ప్రతినిధి:** న్యాల్కల్ మండలం చల్కి గ్రామానికి చెందిన ఓ మహిళ మంజీరా నదిలో దూకి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.హద్నూర్ ఎస్సై సుజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. చల్కి గ్రామానికి చెందిన ఫర్జానా బేగం (65) గత ఏడాది కాలంగా గుండె సంబంధిత అనారోగ్యంతో పాటు మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటి నుంచి కుటుంబ సభ్యులకు చెప్పకుండా వెళ్లిపోయారు. అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి 8.30 గంటల మధ్య చల్కి గ్రామ శివారులోని మంజీరా నదిలో దూకి నీటిలో మునిగి మృతి చెందినట్లు తెలిపారు.శనివారం ఉదయం మృతురాలి కుమారుడు మహ్మద్ సజాహెుద్దీన్ ఫిర్యాదు చేయగా, కుటుంబ సభ్యులు ఎలాంటి అనుమానం వ్యక్తం చేయలేదన్నారు. దీంతో అనుమానాస్పద మృతి (యూడీ) కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై సుజిత్ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి విచారణ కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

# టియుడబ్ల్యూ జిల్లా ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రటరీగా బోడ సుమన్




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 11 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:**తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూ--ఐజెయూ) సంగారెడ్డి జిల్లా ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రటరీగా జోగిపేటకు చెందిన 6టీవీ రిపోర్టర్ బోడ సుమన్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, ఈ నెల 9న సంగారెడ్డిలో నిర్వహించిన (టియుడబ్ల్యూ--ఐజెయూ) జిల్లా మహాసభలో జరిగిన జిల్లా కమిటీ ఎన్నికల్లో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా బోడ సుమన్, మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి పదవి అప్పగించిన జిల్లా జర్నలిస్టులు, సంఘ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు, జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంఘ బలోపేతం, సభ్యుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు. ప్రతి జర్నలిస్టుకు అందుబాటులో ఉంటూ సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు,తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు విరాత్ అలీ, నాయకుడు పైసల్ అహ్మద్, జిల్లా అధ్యక్షుడు యాదగిరి, జాతీయ కార్యవర్గ మాజీ సభ్యుడు వెంకటరెడ్డితో, పాటు జిల్లా జర్నలిస్టులందరికీ ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు, ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు బోడ సుమన్‌ను అభినందించారు....

## ప్రారంభానికి ముందే కుప్పకూలింది

మీరట్ ఉత్తర భారతంలో నాసిరకం పనుల కారణంగా రోడ్లు దెబ్బతింటున్న ఘటనలు ఇటీవల పెరిగిపోతున్నాయి. కొన్ని చోట్ల ప్రారంభానికి ముందే రోడ్లు కుంగిపోతు న్నాయి. తాజాగా ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖం డ్లను కలిపే మీరుట్-కోట్ద్వార్ నేషనల్ హైవే నిర్మాణం పూర్తి కాకముందే, చిన్న వర్షానికే ఒక వైపు సేఫ్టీ వాల్ మొత్తం కూలిపోయింది. ఇలాంటి నాసిరకం పనులపై కాంట్రాక్టర్లు, అధి కారులపైనెటిజన్లుతీవ్రంగా మండిప డుతున్నారు.

# గాయపడిన వారిని పరామర్శించిన ఎమ్మెల్యే రాగమయి



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై 11 ప్రజాబలం:**కల్లూరు పట్టణంకు చెందిన పలువురు శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగ కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శనివారం సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి క్షతగాత్రులను పరామర్శించి, స్వయంగా ప్రభుత్వ డాక్టర్స్ తో వారి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు.ప్రమాదం లో గాయపడిన వారికీ మెరుగైన వైద్య సహాయం అందించాలి అని డాక్టర్స్ కు సూచించారు.గాయపడిన వారికీ, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్, కల్లూరు ఏఎంసి చైర్మన్ బాగం నీరజ, సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు, కల్లూరు మున్సిపల్ వైస్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్స్, కల్లూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొట్రూ అర్జున్ రావు, కల్లూరు పట్టణ అధ్యక్షులు ఉస్మాన్ మరియు కల్లూరు పట్టణ, మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యం

## సీఎంఆర్ఎఫ్,కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో మంత్రి పొంగులేటి



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై11ప్రజాబలం** :ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, పేదల కన్నీళు తుడవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 129 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.35,91,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన మూడు కళ్యాణలక్ష్మి చెక్కులను శనివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. నిరుపేదలకు వైద్య ఖర్చుల భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధిని వేగంగా అందిస్తున్నామన్నారు. అలాగే ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# జేఎన్‌టీయూహెచ్ సుల్తాన్‌పూర్ క్యాంపస్‌లో కళాశాల బస్సులు, మూడు ఆధునిక ప్రయోగశాలల ప్రారంభం

## విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 11 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** :సుల్తాన్ పూర్ (జే ఎన్ టి యు ) కాలేజ్ చరిత్రలోమరో మైలురాయి రాష్ట్ర మంత్రిదామోదర రాజనర్సింహ, వెల్లడి,జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ సుల్తాన్‌పూర్ ఇంజినీరింగ్ మరియు ఫార్మాస్యూటికల్ సైన్సెస్, విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కళాశాల బస్సులతో పాటు,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన, వీఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్ అండ్ సిమ్యులేషన్ ల్యాబొరేటరీ, స్మార్ట్ కంప్యూటింగ్ ల్యాబొరేటరీ, కంప్యూటర్






అప్లికేషన్స్ ఇన్ ఫార్మసీ ల్యాబొరేటరీలను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం ప్రారంభించారు ఈ కార్యక్రమంలోజేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ ఆర్. పాండు, జేఎన్‌టీయూహెచ్ అధికారులు,అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు,ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, నాణ్యమైన సాంకేతిక విద్య అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతఇస్తోందన్నారు. సుల్తాన్‌పూర్,క్యాంపస్ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, ఆధునిక ప్రయోగశాలలు విద్యార్థులకు ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానంపై ప్రాయోగిక అవగాహన కల్పించడంతో పాటు ఉపాధిఅవకాశాలను మరింత పెంచుతాయని తెలిపారు,తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత ( సి ఎస్ ఆర్ ) నిధుల ద్వారా రెండు కళాశాలలకు బస్సులనుఅందించడం అభినందనీయమని, పేర్కొన్నారు,ఈ బస్సుల ద్వారా విద్యార్థులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణాసదుపాయం అందుబాటులోకి ,వస్తుందని చెప్పారు,కొత్తగా, ప్రారంభించిన ప్రయోగశాలల్లో సెమీకండక్టర్ టెక్నాలజీ,



వీఎల్ఎస్ఐ డిజైన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ( ఏ ఎల్ ), మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ( ఎల్ ఓ టి ), సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక రంగాల్లో విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధికి ఈ ప్రయోగశాలలు దోహదపడతాయని పేర్కొన్నారు.అనంతరం సుల్తాన్‌పూర్ క్యాంపస్‌లో ప్రతిపాదిత క్లాక్ టవర్ నిర్మాణ స్థలాన్ని మంత్రి పరిశీలించి, నిర్మాణ రూపకల్పన, వ్యయ అంచనాలను త్వరితగతిన సిద్ధం చేయాలని అధికారులనుఆదేశించారు.

క్లాక్ టవర్ విద్యార్థుల్లో సమయపాలన, క్రమశిక్షణకు ప్రతీకగా నిలుస్తుందన్నారు.

అలాగే, జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కళాశాల ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, అందోల్ క్యాంపస్ నిర్మాణానికి రూ.57 కోట్లు మంజూరైనట్లు వెల్లడించిన మంత్రి,భవనాల నిర్మాణానికి సంబంధించిన స్ట్రక్చరల్ డిజైన్‌ను వెంటనే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి, మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం--పరిశ్రమ--విద్యాసంస్థల భాగస్వామ్యంతోనే ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు, నైపుణ్యాలున్న విద్యార్థులను తీర్చిదిద్దడంసాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ డైరెక్టర్ డా. ఎ. దామోదరం, చీఫ్ ఇంజనీర్ డా.ఎస్.శ్రీనివాసులు, జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కళాశాల ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డా. సునీత రెడ్డి, యూనివర్సిటీ కళాశాల ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డా. ఎస్. విశ్వనాథ రాజు, వైస్ ప్రిన్సిపాల్ డా. వై. రాఘవేందర్ రావు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తోషిబా సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారం మండల కేంద్రంలో ఆడబిడ్డలకు ఆత్మీయ పలకరింపు.



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 11** బిఏటూరునాగారం మండల కేంద్రంలో ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు ఆడబిడ్డలను ఆప్యాయంగా పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆడపడుచులతో మమేకమై, వారి ఆశీర్వాదాలను వినయపూర్వకంగా స్వీకరించారు.

బిఅనంతరం మాట్లాడుతూ, ఆడబిడ్డల అభివృద్ధి, విద్య, ఆరోగ్యం మరియు భద్రతకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

మహిళలు, బాలికల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈర్సవడ్ల వెంకన్న , జిల్లా కార్యదర్శి ఎండి ఖలీల్ ఖాన్,

ఆర్టిఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, పిఏసిఎస్ వైస్ ప్రెసిడెంట్ చెన్నూరి బాలరాజు,బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింగరావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, రామన్నగూడెం సర్పంచ్ గద్దల నవీన్ , పిఏసిఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్ది రాజకుమార్,జిల్లా నాయకులు సలీం, వార్డ్ మెంబర్ ముమ్మనేని రమేష్, రంజిత్ , సునారికాని శ్రీనివాస్, గంపాల శివ కుమార్, వికాస్, తరుణ్ ,సంపత్ ,పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఓటర్లకు అవగాహన కల్పించడం బీఎల్‌వోల బాధ్యత



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి జూలై 11 (ప్రజాబలం):** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు పూరించడంలో ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించడం బీఎల్‌వోల బాధ్యత అని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ ఎన్ఎస్‌సీ నగర్‌లో ఏర్పాటు చేసిన ఎన్యుమరేషన్ కేంద్రాలను కీసర ఆర్డీవో వెంకటరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫారాల స్వీకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అందిన దరఖాస్తులను వెంటనే డిజిటలైజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఫారాల నింపడంలో ఓటర్లకు అవసరమైన సూచనలు, సహాయం అందించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. ప్రతి అర్హ ఓటరు సులభంగా ఎన్యుమరేషన్ ఫారం పూర్తి చేసేలా సహకరించాలని ఆదేశించారు.

పరిశీలనలో ఘట్‌కేసర్ తహసీల్దార్ (ఎంఆర్‌వో) చంద్రశేఖర్, ఏఈఆర్వోలు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# మాతా--శిశు ఆరోగ్యానికి గర్భధారణల మధ్య విరామం అవసరంలి

## జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూలై 11:** ఆరోగ్యకరమైన మాతా--శిశు సంక్షేమానికి గర్భధారణల మధ్య సరైన వ్యవధి ఉండటం అత్యంత అవసరమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం--2026 సందర్భంగా శనివారం అంతాయిపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉన్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ప్రణాళికాబద్ధమైన కుటుంబ వ్యవస్థ ద్వారా కుటుంబాల ఆరోగ్యం, ఆర్థిక స్థితి, సమాజ అభివృద్ధి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రపంచ జనాభా దినోత్సవాన్ని లి“ఆరోగ్యకరమైన మాతా--శిశు సంక్షేమం కోసం గర్భధారణల మధ్య సరైన వ్యవధి -- అనాలోచిత గర్భధారణల నివారణ”లి అనే నినాదంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల మధ్య సరైన అంతరం ఉంటే కుటుంబాలు ఆరోగ్యంగా, సమర్థవంతంగా ఎదుగుతాయని చెప్పారు.

పెరుగుతున్న జనాభా కారణంగా ఆహారం, తాగునీరు, ఆరోగ్య సేవలు, విద్య వంటి మౌలిక వనరులపై ఒత్తిడి పెరుగుతోందని, కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక సాధనాల వినియోగం, మాతా--శిశు ఆరోగ్య సేవలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా కుటుంబ సంక్షేమంపై అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య విద్యా కార్యక్రమాలు, ర్యాలీలు, కుటుంబ నియంత్రణ సేవల ప్రోత్సాహ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందించిన వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులను మెరిట్ సర్టిఫికెట్లు, మెమెంటోలతో సత్కరించారు. ఒక్క ఆడపిల్లతో కుటుంబ నియంత్రణను స్వీకరించిన దంపతులకు రూ.1,000 నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

కార్యక్రమంలో ఉప జిల్లా వైద్యాధికారులు డా. లావణ్య, డా. గీత, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డా. శ్రీదేవి, డా. నాగరాజు, డా. పవన్‌రెడ్డి, డా. కౌశిక్, డెమో వసంతరెడ్డి, ఉషారాణి, విజయ్‌కుమార్‌తో పాటు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449 Email;prajaabalamnews@gmail.com